www.visalaandhra.com

శుక్రవారం
26-01-2024

విజయవాడ ప్రచురణ

సంపుటి : 72, సంచిక : 214
పేజీలు : 8, వెల: రూ.5.00

Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

విశాలాంధ్ర

స్థాపితం : 1952

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

పాఠకులకు,
ప్రకటనకర్తలకు,
ఏజెంట్లకు,
శ్రేయోభిలాషులకు
75వ
గణతంత్రదినోత్సవ
శుభాకాంక్షలు

-జనరల్ మేనేజర్

దాసరి కొండప్ప   గడ్డం సమ్మయ్య   ఉమామహేశ్వరి

ముగ్గురు తెలుగువారికి 'పద్మశ్రీ'

- ఏపీలో ఉమామహేశ్వరికి... తెలంగాణలో సమ్మయ్య, కొండప్ప
- మొత్తం 34 పద్మ పురస్కారాలు ప్రకటించిన కేంద్రం

న్యూఢిల్లీ : భారత ప్రభుత్వం 2024 సంవత్సరానికిగాను ప్రతిష్ఠాత్మక పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ అవార్డులను ప్రకటించింది. దేశ 75వ గణతంత్ర వేడుకలను పురస్కరించుకుని గురువారం రాత్రి మొత్తం 34 మందికి ఈ పురస్కారాలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాల నుంచి ముగ్గురు పద్మ గౌరవాన్ని దక్కించుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరికథ కళాకారిణి ఉమామహేశ్వరికి, తెలంగాణ రాష్ట్రం నారాయణపేట జిల్లా దామరగిద్ద వాసి బుర్ర వీణ వాయిద్య కళాకారుడు దాసరి కొండప్ప, జనగామకు చెందిన యక్షగాన కళాకారుడు గడ్డం సమ్మయ్యకు పద్మశ్రీ అవార్డులు ప్రకటించారు. పద్మశ్రీ అవార్డుల జాబితా విడుదలైనప్పటికీ పద్మవిభూషణ్, పద్మభూషణ్ అవార్డులు ఇంకా ప్రకటించాల్సి ఉంది.

పద్మశ్రీ అవార్డులు– కళల విభాగం

డి.ఉమామహేశ్వరి – ఆంధ్రప్రదేశ్
గడ్డం సమ్మయ్య – తెలంగాణ
దాసరి కొండప్ప – తెలంగాణ
జానకీలాల్ – రాజస్థాన్
గోపీనాథ్ స్వైన్ – ఒడిశా
స్మృతి రేఖ ఛక్మా – త్రిపుర
ఓంప్రకాశ్ శర్మ – మధ్యప్రదేశ్
నారాయణన్ ఈపీ – కేరళ

- మిగతా 2 లో

ప్రధాని మోదీ, సీఎం జగన్
తోడు దొంగలు

అమరావతి నుంచే వైసీపీ పతనం ప్రారంభం

- రాజధాని రైతుల ఉద్యమం చరిత్రాత్మకం: రామకృష్ణ
- అంతిమ విజయం ఉద్యమకారులదే: వర్ల, ఉమ
- మూడు నెలల్లో కొత్త ప్రభుత్వం ఖాయం: ముప్పాళ్ల
- ప్రధాని అండతోనే జగన్ దుశ్శాసనపర్వం: బాబురావు

విశాలాంధ్ర –తుళ్లూరు: అమరావతి రాజధాని విధ్వంసంలో ప్రధాని మోదీ, సీఎం జగన్ తోడు దొంగల్లా వ్యవహరించారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మండిపడ్డారు. అమరావతి రాజధాని మహోద్యమం గురువారంతో 1500 రోజులకు చేరిన సందర్భాన్ని పురస్కరించుకుని వెలగపూడి, మందడం, తుళ్లూరు గ్రామాల్లో అమరావతి రైతుల సమర శంఖం పేరుతో సభలు నిర్వహించారు. వివిధ రాజకీయపార్టీల నేతలు, ప్రజాసంఘాల నేతలు పాల్గొని ప్రసంగించారు. రామకృష్ణ మాట్లాడుతూ మోసగాడు, నయవంచకుడు ముఖ్యమంత్రి అయితే ఏ రకంగా ఉంటుందో రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలే నిదర్శనమన్నారు. తమ నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఎవరికీ భయపడడు... ధైర్యంగా మాట్లాడతాడని వైసీపీ నేతలు చెబుతారని, వాస్తవానికి ఆయన పిరికిపంద అని అన్నారు. నిజంగా జగన్‌కు ధైర్యం ఉంటే ఒక్కసారైనా అమరావతి తనకు నచ్చదని చెప్పారా అని ప్రశ్నించారు. వేలాదిమంది పోలీసుల భద్రత లేకుండా జనాల్లోకి వెళ్లే పరిస్థితి జగన్‌కి ఉందా అని నిలదీశారు. కర్నూలులో హైకోర్టు పెడతానని చెప్పి రాయలసీమ ప్రజలను మభ్యపెట్టిన సీఎం... ఆ దిశగా కనీసం ప్రతిపాదనలైనా పెట్టారో లేదో చెప్పాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. విశాఖలో పరిపాలన రాజధాని అని చెప్పి రిషికొండకు గుండు కొట్టారని, అబద్ధాలతో మభ్యపెట్టి ప్రజలను ఓట్లు ఎలా అడుగుతారని ప్రశ్నించారు. విశాఖలో నివాసం ఉండేందుకు రూ.450 కోట్ల ప్రజాధనాన్ని వెచ్చించడం ఎంతవరకు సబబో చెప్పాలన్నారు. మూడు నెలల తరువాత వైసీపీ ప్రభుత్వం ఉండదని, కొత్త ప్రభుత్వం రావడం ఖాయమన్నారు. వైసీపీ పతనం అమరావతి నుంచే ప్రారంభమైందని, నూటికి నూరు శాతం అమరావతి రాజధానిగా కొనసాగుతుందని రామకృష్ణ స్పష్టం చేశారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు మాట్లాడుతూ

- మిగతా 2 లో

ఎన్నికలకు వైసీపీ 'సిద్ధం'

- రేపటి నుంచి జగన్ ప్రచారం
- భారీగా హోర్డింగుల ఏర్పాటు
- అసమ్మతి వీడిన మల్లాది
- ఒంగోలు ఎంపీ పక్క చూపులు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి : ఎన్నికల ప్రచారానికి వైసీపీ సర్వం సిద్ధమైంది. ఈనెల 27 నుంచి ఉత్తరాంధ్రలోని భీమిలి నుంచి సీఎం జగన్ ఎన్నికల శంఖరావాన్ని పూరించనున్నారు. ఈ సందర్భంగా విశాఖ నగరంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో సిద్ధం పేరుతో ఏర్పాటు చేసిన భారీ వైసీపీ హోర్డింగులు ఆసక్తికరంగా ఉన్నాయి. సీఎం జగన్ వేలిపెట్టి చూపుతూ, వెనుక వైఎస్సార్ జెండా రంగుతో ఉన్న వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బొమ్మతో కూడిన హోర్డింగ్‌లతో వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. పెద్దటి బోర్డులో కేవలం సిద్ధం అనే మూడు అక్షరాలు, సీఎం జగన్ బొమ్మ మాత్రమే ఉన్నాయి. ఇవి రాజకీయ వర్గాల్లో విస్తృతమైన చర్చకు దారితీస్తున్నాయి. ఈ హోర్డింగులు క్రమేపీ రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించనున్నాయి. ఈ నెల 27న విశాఖలో ప్రారంభించనున్న ప్రచార సభకు ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాల ప్రజలు తరలివెళ్లేలా వైసీపీ ఏర్పాట్లు చేస్తోంది. ఆ దిశగా ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ అధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. భీమిలిలో నిర్వహించే మొట్టమొదటి సభను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు వైసీపీ సిద్ధమైంది. అనంతరం ఉభయ గోదావరి జిల్లాల కేంద్రంగా ఏలూరులో ఈనెల 30న రెండో సభను నిర్వహించనున్నారు. దానికి ప్రాంతీయ సమన్వయకర్త పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి అధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టారు. సీఎం జగన్ సభల ఏర్పాటుతో అసమ్మతి ఎమ్మెల్యేలను దారిలోకి తెచ్చేందుకు ఎక్కడికక్కడే ప్రాంతీయ ఇన్‌ఛార్జ్‌లు, జిల్లా అధ్యక్షుల అధ్వర్యంలో బుజ్జగింపులు చేపడుతున్నారు. వైసీపీ ఇన్‌ఛార్జ్‌ల మార్పులు, చేర్పుల అనంతరం చాలా మందికి టికెట్లు లభించక అసంతృప్తితో ఉన్నారు. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు ఇతర పార్టీలోకి వెళ్లేందుకు దిక్కులు చూస్తున్నారు.

టీడీపీలోకి ఒకేసారి అసంతృప్త ఎమ్మెల్యేలు?

సీఎం జగన్ ఎన్నికల ప్రచారానికి కౌంటర్‌గా వైసీపీలో సీట్లు దక్కని కొంత మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేస్తారని తెలిసింది. పెనమలూరు ఎమ్మెల్యే టీడీపీలో చేరిక ఆలస్యమవుతోంది. పెనమలూరు వైసీపీ ఇన్‌ఛార్జ్ పార్థసారథికి ఇవ్వకపోడంతో ఆయన అసంతృప్తిగా ఉండి పార్టీ

- మిగతా 2 లో

'ఇండియా' పటిష్టత
అవశ్యం



- కాంగ్రెస్ విశాలంగా ఆలోచించాలి
- మోదీ బ్లాక్‌మెయిల్‌తో పార్టీలు వెనక్కి
- జగన్, చంద్రబాబు... మోదీ జపం
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: దేశంలో ప్రమాదకరమైన మతోన్మాద ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా నిలబడాలంటే... ఇండియా కూటమి మరింత బలపడాలని, అవసరమైతే ఒకటిరెండు సీట్లను కాంగ్రెస్ త్యాగం చేసైనా...కూటమి పార్టీలతో ఐక్యత చూపాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ హితవు పలికారు. ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీ అని, అందువల్ల ఆ పార్టీ విశాల దృక్పథంతో ఆలోచించాలని, అందరినీ కలుపుకుపోవాల్సిన అవసరముందని,

- మిగతా 2 లో

'ఇండియా'కు నితీశ్ దూరం?

- మళ్లీ బీజేపీ చెంత చేరేందుకు ఆసక్తి
- ఢిల్లీ వెళ్లిన బీహార్ జేడీయూ, బీజేపీ నేతలు

న్యూఢిల్లీ/పాట్నా: 'ఇండియా' కూటమి ఆవిర్భావంలో మూడో కీలక నేతగా ఉన్న బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కూటమికి దూరం జరిగే సంకేతాలు వెలువడుతున్నాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో మళ్లీ చేతులు కలిపే అవకాశాలు ఉన్నాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. రాహుల్ గాంధీ చేపడుతున్న భారత్ జోడో న్యాయ యాత్రలో నితీశ్ పాల్గొనడం లేదని తెలిసింది. సీట్ల పంపకాలపై కాంగ్రెస్ వహిస్తున్న జాప్యంపై నితీశ్ తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అంతేకాకుండా బీహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి నుంచి జేడీయూ నిష్క్రమిస్తున్నదనే మరికొన్ని వర్గాలు చెప్పాయి. ఈ ఎన్నికల్లో జేడీయూ మళ్లీ బీజేపీతో చేతులు కలుపనుందని వివరించాయి. గత రెండు రోజులుగా ఇద్దరు కీలక నేతలు మమతా బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్ 'ఇండియా' కూటమి పట్ల తమ అసంతృప్తిని వెలిబుచ్చారు. కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు ఉండబోదని, పశ్చిమ బెంగాల్, పంజాబ్‌లో ఒంటరిగా వెళ్లనున్నట్లు చెప్పారు. ఫిబ్రవరి 4న బెట్టియాలో జరిగే ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీతో నితీశ్ వేదికను కూడా పంచుకునే అవకాశం ఉందని ఆ వర్గాలు వెల్లడించాయి. నితీశ్ పునరాగమనంపై రాష్ట్ర బీజేపీ నేతలు సందేహాలు వ్యక్తం చేసినప్పటికీ, పార్టీ అగ్ర నాయకత్వం ముఖ్యమంత్రిని దూషించవద్దని రాష్ట్ర నేతలకు ఖరాఖండిగా చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బీజేపీ బీహార్ రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాట్ చౌదరిని ఢిల్లీకి పిలిపించారు. ఆయన, బీహార్ సీనియర్ నాయకుడు సుశీల్ మోదీ ఈ సాయంత్రం పార్టీ అధ్యక్షుడు జె.పి.నడ్డా, కేంద్ర హోం మంత్రి, బీజేపీ ప్రధాన వ్యూహకర్త అమిత్ షాతో సమావేశమయ్యే అవకాశం ఉంది. 72 ఏళ్ల నితీశ్‌కు కూటములు మారటం, మద్దతు ఉపసంహరించుకోవడం ఇదే తొలిసారి కాదు. ఏ పార్టీ గెలిచినా... అధికారం మాత్రం తనకే ఉండాలన్నట్లు వ్యవహరించే ఆయన... 2013 నుంచి ఇప్పటి వరకు ఐదు సార్లు తన మిత్రపక్షాలకు దూరంగా వెళ్లారు. మహాకూటమి

నుంచి వైదొలిగి ఎన్డీయేలో చేరిన మూడేళ్ల తర్వాత 2022లో చివరిసారిగా ఆయన పార్టీ మారారు. అయితే తాజాగా వంశపారంపర్య రాజకీయాలపై ముఖ్యమంత్రి పదునైన వ్యాఖ్యలు, సామాజిక

- మిగతా 2 లో

గిరిజన ప్రాంతాల్లో
300 సెల్‌టవర్లు

944 ఆవాసాలకు... 2 లక్షల మంది ప్రజలకు సౌకర్యం
వర్చువల్‌గా ప్రారంభించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి: మారుమూల గిరిజన ప్రాంతాలకు కూడా సెల్, ఇంటర్‌నెట్ కనెక్టివిటీ కల్పించడం ద్వారా ఆ ప్రజలకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం జిల్లాల్లోని మారుమూల గిరిజన ప్రాంతాలకు సమర్థవంతమైన టెలికాం సేవలు అందించే 300 సెల్‌టవర్లను సీఎం గురువారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఎయిర్‌టెల్ అధ్వర్యంలో 136, జియో అధ్వర్యంలో 164 టవర్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ మాట్లాడుతూ ఈ టవర్ల ఏర్పాటు ద్వారా 944 ఆవాసాలకు, రెండు లక్షల మంది ప్రజలకు ఉపయోగం కలుగుతుందన్నారు. ఆయా గ్రామాల్లో టీవీలు, ఫోన్లు పనిచేయడంతోపాటు మనం ఇచ్చే పథకాలు అన్నింటికీ వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమం వేగవంతమవుతుందన్నారు. మనం బటన్ నొక్కిన వెంటనే వాళ్లకు డబ్బులు బదిలీ అయ్యే కార్యక్రమం అంతేవేగంగా జరుగుతుందని, వాళ్లు వెంటనే చూసుకునే

- మిగతా 2 లో

ఇదీ లోకం!

జనగణమన 'జై శ్రీరామ్' జయహే!

ఎన్నికల నిర్వహణకు 982 కొత్త పోస్టులు

- 105 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పటిష్ఠ నిఘా
- సీఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- ఏర్పాట్లపై కలెక్టర్లతో సమీక్ష

8లో

అన్యాయంపై 'ఇండియా' ఐక్యపోరు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

దేశవ్యాప్తంగా అన్యాయాన్ని ఎదుర్కోవడంలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఐక్యతపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు.



నాటో విస్తరణ వద్దు

- తక్షణమే కూటమిని వీడాలి
- అన్ని స్థావరాలు మూసివేయాలి
- టర్కీ కమ్యూనిస్టుల డిమాండ్ - నిరసన

అంకారా: నాటో విస్తరణకు వ్యతిరేకంగా టర్కీ కమ్యూనిస్టులు పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. పార్లమెంటులో వీటో ద్వారా స్వీడెన్ ప్రవేశానికి మార్గం సుగమం చేయడాన్ని ఖండించారు. నాటో నుంచి టర్కీ నిష్క్రమణకు డిమాండ్ చేశారు. దేశంలోని నాటో స్థావరాలన్నీ మూసివేయాలని వేర్వేరు కమ్యూనిస్టు సంఘాలు ఐక్యంగా టర్కీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. నాటో కూటమి బలోపేతానికి టర్కీ ప్రభుత్వం చేపట్టిన చర్యలకు వ్యతిరేకంగా టర్కీ కమ్యూనిస్టు పార్టీ (టీకేపీ) ధర్నా చేసింది. పార్లమెంటులో నాటో కూటమికి అనుకూలంగా ఓటు వేయడాన్ని దుయ్యబట్టింది. కూటమిలో టర్కీ స్థానాన్ని పదిలం చేసిన జస్టిస్, డెవలప్‌మెంట్ పార్టీ (ఏకేపీ) ప్రభుత్వ తీరును ఖండించింది. నాటో సామ్రాజ్యవాద యుద్ధోన్మాదానికి మద్దతివ్వడాన్ని తీవ్రంగా తప్పుపట్టింది. ది వర్కర్స్ పార్టీ ఆఫ్ టర్కీ (టీఐపీ), ది లేబర్ పార్టీ (ఈఎంఈపీ)తో పాటు లెఫ్ట్ సంఘాలు కూడా నాటోలో టర్కీ జోక్యాన్ని వ్యతిరేకించాయి. దేశంలోని నాటో స్థావరాల మూసివేతకు పిలుపునిచ్చాయి. టీకేపీ కార్యకర్తలు టర్కీ గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ ఎదుట భారీ ప్రదర్శన నిర్వహించారు. నాటోను బయటకు పంపండి... స్థావరాలను మూసివేయండి... హంతక అమెరికా ... మా దేశం నుంచి వెళ్లిపో' అని పెద్దపెట్టున నినాదాలు చేశారు. తటస్థత పాటించే సంప్రదాయ విధానాలతో రాజీ పడి అమెరికా నేతృత్వ యుద్ధ కూటమిలో భాగస్వామి అయినందుకు తమ దేశాల ప్రభుత్వాలను కమ్యూనిస్టు పార్టీలు తీవ్రస్థాయిలో ఆక్షేపిస్తున్నాయి. 'టర్కీలోని ఏకేపీ ప్రభుత్వం సీడెన్ సభ్యత్వాన్ని ఆక్షేపించింది. దీనిని అడ్డుపెట్టుకొని అనేక అంశాల్లో తమ మాట నెగ్గించుకునే ప్రయత్నం చేసింది. ముఖ్యంగా ఎఫ్-16 ఎయిర్‌క్రాఫ్ట్ కొనుగోలునకు యత్నించింది' అని టర్కీ కమ్యూనిస్టు పార్టీ తాజా ప్రకటన పేర్కొంది. నాటోను ఉగ్రవాద సంస్థగా అభివర్ణించింది. సభ్యదేశాలతో పాటు ఇతర దేశాల ప్రజలకు భారీగా భద్రతా ముప్పును కలిగించే ఉగ్రవాద సంస్థ, కేపిటలిస్ట్ ఆర్డర్ కొనసాగింపునకు యత్నిస్తూ యుద్ధ పద్ధతులను ప్రత్యక్షంగా అనుసరిస్తుంది. ఉగ్రవాద వ్యూహాల వినియోగానికి ఏ మాత్రం ఆలోచించదు. కార్మికుల గొంతులు నొక్కేందుకు ఎంత మాత్రం జంకదు. నాటో నుంచి విముక్తి తక్షణావశ్యం. ఈ దిశగా తొలి అడుగుగా నాటో నుంచి మన దేశంతో పాటు ఇతర దేశాలు నిష్క్రమించాలి' అని కమ్యూనిస్టు పార్టీ సూచించింది.

విశాలాంధ్ర ప్రపంచం

ఆస్ట్రేలియాలో నలుగురు భారతీయుల మృతి

- ఫిలిప్ ఐలాండ్‌లో ఘటన
- మృతుల్లో ముగ్గురు మహిళలు
- అందరిదీ ఒకే కుటుంబం

మెల్‌బోర్న్: సరదాగా సముద్రంలో ఈతకు వెళ్లి నలుగురు ప్రాణాలు కోల్పోయిన ఘటన ఆస్ట్రేలియా ఫిలిప్ ఐలాండ్... విక్టోరియన్ వాటర్స్‌లో జరిగింది. చనిపోయిన నలుగురు భారతీయులు కాగా వీరిలో ముగ్గురు మహిళలు ఉన్నారు. ఓ 41 ఏళ్ల మహిళ కాగా మిగతా ఇద్దరు 20 ఏళ్ల వారున్నారు. 20 ఏళ్లలో ఇదే తొలి విషాదంగా ఆస్ట్రేలియా అధికారులు గురువారం తెలిపారు. ఫిలిప్ ఐలాండ్ బీచ్ వద్ద ఈ నలుగురిని అత్యవసర సిబ్బంది గుర్తించినట్లు చెప్పారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారని, ముగ్గురిని ఆసుపత్రికి తరలించగా వారు అక్కడ చనిపోయారని వెల్లడించారు. బుధవారం మధ్యాహ్నం 3.30గంటలప్పుడు ఈ ఘటన చోటుచేసుకున్నదన్నారు. అత్యవసర సహాయ సిబ్బంది అచేతనంగా ఉన్న నలుగురిని రెస్క్యూ పడవల సాయంతో బయటకు తీసినట్లు చెప్పారు. లైఫ్ సేవింగ్ విక్టోరియా స్టేట్ ఏజెన్సీ కమాండర్ కేన్ ట్రీలోయర్ మాట్లాడుతూ ఘటనాస్థలానికి చేరుకొన్న లైఫ్ గార్డులు వీరిని బయటకు తీశారు కానీ వారెవ్వరూ స్పృహలో లేరు. మెల్‌బోర్న్ ఆసుపత్రికి తరలించగా వారంతా మరణించినట్లు వైద్యులు ధ్రువీకరించారు' అని అన్నారు. కాగా, మృతులు పంజాబ్, హిమాచల్ ప్రదేశ్ రాష్ట్రాల వారని తెలుస్తోంది. ఈ ఘటనపై కాన్‌బెర్రాలోని భారత హైకమిషన్ స్పందించింది. 'ఆస్ట్రేలియాలో నీటమునిగి నలుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నాం. అవసరమైన సహాయాన్ని అందిస్తాం. మెల్‌బోర్న్ అధికారులు మృతుల సన్నిహితులతో సంప్రదింపులు జరుపుతున్నారు' అని ట్వీట్ చేసింది.

'ఇండియా' పటిష్టత అవశ్యం

(మొదటిపేజీ తరువాయి)

ఆ యత్నంలో కాంగ్రెస్ ఎక్కడో విఫలమవుతోందని నారాయణ చెప్పారు. నారాయణ గురువారం న్యూదిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీజేపీ మతతత్వ విధానాలు, మోదీ ప్రభుత్వ పాలనపై విమర్శలు గుప్పించారు. ఇండియా కూటమి జనంతో ఉందని, బీజేపీ మాత్రం జైశ్రీరామ్ నినాదంతో దేవుడిని పట్టుకొని వేలాడుతోందన్నారు. రాజ్యాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని మండిపడ్డారు. అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవానికి దేశ ప్రథమ పౌరులు, రాష్ట్రపతిని ఆహ్వానించకుండా మహిళ పట్ల మోదీ ప్రభుత్వం తీవ్ర వివక్ష చూపిందని నారాయణ విమర్శించారు. ఇదేనా మహిళలకు, ఆదివాసీయులకు ఇచ్చే గౌరవమని ప్రశ్నించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్‌షా నేరస్తులుగా మారిపోయారన్నారు. సెక్యులరిజాన్ని పరిరక్షించుకోవాలంటే ఇండియా కూటమి బలపడాల్సిన అవసరముందన్నారు. 26 రాజకీయ పార్టీలతో ఇండియా కూటమి ఏర్పాటైందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరముందని సూచించారు. ఇందుకోసం కాంగ్రెస్ కీలకపాత్ర పోషించాలని హితవు పలికారు. మోదీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో కొందరు ఇండియా కూటమిని వీడుతున్నారని, కాంగ్రెస్‌లో విశాల దృక్పథం లోపించడంతో మరికొందరు బయటకు పోతున్నారని, ఇది ప్రమాదకర సంకేతమని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో మోదీ పొరబాటున గెలిస్తే ప్రజాస్వామ్యం మంటగలుస్తుందని, దీనిని కాంగ్రెస్ విస్మరించరాదన్నారు. ఆయా రాష్ట్రాల్లో రాజకీయ ఎత్తుగడలపై చర్చిస్తున్నామన్నారు. ఫిబ్రవరి 2,3,4 తేదీల్లో సీపీఐ జాతీయ మహాసభలు హైదరాబాద్‌లో జరగనున్నాయని, ఆ సమావేశాల్లో జాతీయ రాజకీయ పరిస్థితులపై చర్చిస్తామని వివరించారు. కొందరు సెక్యులరిజం భావజాలంతో పైకి ఉంటూ, లోలోపల బీజేపీకి ఊడిగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో రాజకీయ పరిస్థితులే ఇందుకు తాజా ఉదాహరణ అని చెప్పారు. తెలుగు రాష్ట్రాలకు వాస్తవంగా బీజేపీనే ప్రథమ శత్రువు అని, బీజేపీ అధికారం చేపట్టాక ఆ రెండు రాష్ట్రాలకు అన్యాయం చేసిందన్నారు. ఏపీకి విభజన హామీల నుంచి ప్రత్యేక హోదా అమలు వరకు పూర్తిగా దగా చేసిందని, దీంతో తెలుగు ప్రజానీకానికి బీజేపీ బద్ధశత్రువుగా మారిందని మండిపడ్డారు. ఇదే సమయంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు తెలుగు ప్రజల పక్షాన నిలబడకుండా...తెలుగు ప్రజలకు అన్యాయం చేసిన బీజేపీ వైపే ఉండటం సిగ్గుచేటన్నారు. లేచినిలబడి నమస్కరించే స్థాయికి దిగజారి బీజేపీకి ఊడిగం చేస్తున్నాయన్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని కేసీఆర్ కౌగిలించుకున్నందునే ఓటమి పాలయ్యారని, అది ధృతరాష్ట్రుని కౌగిలి అని ఎద్దేవా చేశారు. ఇదేవిధంగా టీడీపీ, వైసీపీ దొంగ నాటకాలు ఆపాలని, అవసరమైతే ఇండియా కూటమిలో చేరాలని సూచించారు. తెలంగాణలో అన్ని పార్టీలు కలిసి పోరాటం చేయడం ద్వారా కాంగ్రెస్ విజయం సాధించిందని, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఇతర పార్టీలను కలుపుకోవడానికి సిద్ధపడకపోవడంతో కాంగ్రెస్ నష్టపోయిందని విశ్లేషించారు. ఈ ఎన్నికలపై కాంగ్రెస్ సమీక్షించుకుంటే మంచిదని హితవు పలికారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు నారాయణ బదులిస్తూ...ఏపీలో వైసీపీ ప్రభుత్వానికి ప్రజాస్వామ్య సూత్రాలే లేవని, మోదీని తలదన్నేలా అక్కడ ప్రభుత్వం ఉందని విమర్శించారు. వైసీపీకి ప్రతిపక్షాల దగ్గర నుంచి ప్రజలు, కన్నతల్లి, సొంత చెల్లి వరకు అందరూ శత్రువులేనని పరోక్షంగా సీఎం జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు సైతం మోదీకి వంత పాడుతున్నారని దుయ్యబట్టారు. తమ పార్టీ మాత్రం దేశవ్యాప్తంగా ఇండియా కూటమిని బలపరుస్తోందని నొక్కిచెప్పారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఇండియా కూటమిలోకి వచ్చే రాజకీయ పార్టీలను ఆహ్వానిస్తామని, దీనిపై జాతీయ కార్యవర్గ సమావేశాల్లో స్పష్టత వస్తుందన్నారు. తృణమూల్ కాంగ్రెస్, ఆప్ వంటి పార్టీలు కాంగ్రెస్‌కు దూరం కావడం వెనుక బీజేపీ బెదిరింపు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు ఉండవచ్చని నారాయణ అనుమానం వ్యక్తంచేశారు. కాంగ్రెస్‌కు, ఇండియా కూటమిలోని ఇతర పార్టీలకు మధ్య ఆయా రాష్ట్రాల్లో సీట్ల సర్దుబాటుపై సఖ్యత కుదరడం లేదని, ఈ విషయంలో కాంగ్రెస్ ఒకటి, రెండు సీట్లు కోల్పోయినా కూటమి పటిష్ఠతకు కృషి చేయాలని సూచించారు. అయోధ్యలో ఆలయం కట్టడంపై తమకు అభ్యంతరం లేదని, అయితే లౌకికదేశంలో ఆలయ ప్రారంభోత్సవానికి ప్రధాని, ముఖ్యమంత్రి హాజరు కావడం సరికాదని వ్యాఖ్యానించారు.

'ఇండియా'కు నితీశ్ దూరం?

(మొదటిపేజీ తరువాయి)

మాధ్యమాల్లో లాలూ యాదవ్ కుమార్తె నుంచి వచ్చిన సమాధానం తర్వాత ఈ తాజా పరిణామాలు చోటుచేసుకున్నాయి. బుధవారం నితీశ్ కుమార్ 'భారత్ జోడో న్యాయ యాత్రకు కాంగ్రెస్ ఆహ్వానానికి ప్రతిస్పందన లేకపోవడంతో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఐక్యత గురించి ఊహాగానాలు లేవనెత్తింది. భారత్ జోడో న్యాయ యాత్ర ఈ నెల 30న బీహార్‌లో ప్రవేశించనుంది. ఈ యాత్రలో పాల్గొనాలని కాంగ్రెస్ పార్టీ శాసనసభ పక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ ద్వారా నితీశ్ కుమార్‌కు ఆహ్వానం అందించారు.

కానీ, నితీశ్ కుమార్ ఈ యాత్రలో పాల్గొనడానికి విముఖంగా ఉన్నారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. 'ఇండియా' కూటమి ఎన్నికల సన్నాహాల్లో స్పష్టత లేకపోవడం, ప్రధాన మంత్రి అభ్యర్థిగా ఆమోదించబడటంపై నితీశ్ కుమార్ కలత చెందారని ఆ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాల చర్చల్లో జాప్యం మరింత తీవ్రమైంది. కాగా, లాలూ యాదవ్ ఇప్పటికే నితీశ్‌తో ఫోన్‌లో మాట్లాడినట్లు పేర్కొన్నాయి.

తోడు దొంగలు

(మొదటిపేజీ తరువాయి)

అమరావతి రాజధాని వ్యవహారంలో బీజేపీ, వైసీపీ రెండూ ముద్దాయిలేనని, మోదీ అండతోనే జగన్ అమరావతిని సర్వనాశనం చేశారన్నారు. అమరావతి ఉద్యమం రాజకీయ పోరాటంగా ఉండాలని ఆకాంక్షించారు. అమరావతి రాజధానిగా కొనసాగుతుందని, రైతులకు, కూలీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చుతామనే అజెండాతో ముందుకుపోవాలన్నారు. రైతులకు 20 ఏళ్ల కౌలు ఇవ్వాలన్నారు.

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ గొప్ప సంకల్పంతో రైతులు, మహిళలు, రైతు కూలీలు 1500 రోజుల పాటు ఉద్యమాన్ని కొనసాగించడం అభినందనీయమన్నారు. అమరావతి మహిళల పోరాటం కచ్చితంగా చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖిస్తారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ పతనం రాజధాని మహిళల ఉద్యమం నుంచే ప్రారంభమైందని, మహిళల కన్నీటిలో జగన్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. వచ్చే మూడు నెలల్లో కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి అమరావతే ఏకైక రాజధానిగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ రాష్ట్రానికి మధ్యలో, అందరికీ అందుబాటులో తుళ్లూరు ప్రాంతంలో రాజధాని నిర్మిస్తే బాగుంటుందని అందరికంటే ముందుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ చెప్పారని గుర్తుచేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని విధాలుగా ఇబ్బందులు పెట్టినా, కేసులు పెట్టి వేధించినా రైతులు అలుపెరగని పోరాటం నిర్వహించారని, ఈ ఉద్యమం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. రైతుల త్యాగాలు వృథా కావని, అంతిమం విజయం వారిదేనన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. మాజీమంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావు మాట్లాడుతూ అమరావతి రాజధానిని రక్షించుకోవడంతోపాటు వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించడానికి ప్రజలు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. తెనాలి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ రాబోయేది చంద్రబాబు ప్రభుత్వమేనని, అమరావతి రాజధానిని దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా తీర్చిదిద్దుతారని అన్నారు. ముస్లిం నాయకులు సిల్లి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమాన్ని సంక్షోభంలోకి నెట్టిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు జంగాల అజయ్‌కుమార్, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిలకా విజయ్‌కుమార్, అమరావతి పరిరక్షణ సమితి జేఏసీ నాయకులు పువ్వాడ సుధాకర్, గద్దె తిరుపతిరావు, ఆలూరి సురేష్, ధనేకుల రామారావు, కంభంపాటి శిరీష, రాయపాటి శైలజ, జమ్ముల శ్యామ్‌కిషోర్ కుమార్, సత్యనారాయణ, ఆలూరు శ్రీనివాసరావు, ఆలూరు యుగంధర్, బెజవాడ రమేష్, సరేంద్ర, బెల్లంకొండ నరసింహారావు, వరలక్ష్మి, కల్లం రాజశేఖర్‌రెడ్డి తదితరులు ప్రసంగించారు. రాజధాని నిర్మాణానికి భూములిచ్చిన రైతులను అనేక విధాలుగా వేధించిన జగన్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

భారత్‌కు ఫ్రాన్స్ అధ్యక్షుడు మాక్రాన్

అంబర్ కోట సందర్శన

రామ్‌బాగ్ ప్యాలెస్‌లో మాక్రాన్‌కు ప్రత్యేక విందు

జైపూర్: ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమాన్యుయేల్ మాక్రాన్ గురువారం భారత్‌కు చేరుకున్నారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా ఆయన రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు వచ్చారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, ఆ రాష్ట్ర గవర్నర్ కల్‌రాజ్ మిశ్రా, ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ ఆయనకు ఘనస్వాగతం పలికారు. జైపూర్‌లోని అంబర్ కోటను మాక్రాన్ సందర్శించారు. అక్కడ భారత విద్యార్థులతో ముచ్చటించారు. యునెస్కో ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన 'జంతర్ మంతర్'ను భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో కలిసి సందర్శించారు. అనంతరం సంగనేరి గేట్ వరకు వీరిద్దరూ రోడ్ షోలో పాల్గొన్నారు. మార్గంమధ్యలో హవా మహల్ వద్ద జైపూర్ ప్రత్యేక మసాలా టీని ఆస్వాదించారు. అక్కడే యూపీఐ చెల్లింపుల ద్వారా హస్త కళాకృతులు కొనుగోలు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. రామ్‌బాగ్ ప్యాలెస్‌లో మాక్రాన్ కోసం ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు. గణతంత్ర వేడుకలకు ముఖ్యఅతిథిగా అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌ను ఆహ్వానించగా ఆయన అనేక కారణాలతో రాలేనని చెప్పిన నేపథ్యంలో ఫ్రాన్స్ అధ్యక్షుడికి భారత్ ఆహ్వానం పంపింది. దానిని ఆయన అంగీకరించారు. గతేడాది జులైలో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో నిర్వహించిన ఫ్రాన్స్ జాతీయ దినోత్సవ 'బాస్టిల్ డే' పరేడ్‌లో ప్రధాని మోదీ ముఖ్యఅతిథిగా పాల్గొన్న విషయం తెలిసిందే.

మా గోడు పట్టదా...

ఫ్రాన్స్ ప్రభుత్వంపై రైతుల కన్నెర్ర

దేశవ్యాప్తంగా సమ్మె-రహదారుల దిగ్బంధం

బ్రసెల్స్: ఫ్రాన్స్‌లో రైతులు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వ చర్యలపై ఆగ్రహం వెలిబుచ్చారు. తమ గోడు పట్టదా అని నిలదీశారు. దేశవ్యాప్త సమ్మె నిర్వహించి, ప్రధాన నగరాల్లోని ముఖ్య మార్గాలను దిగ్బంధించారు. ప్రభుత్వ భవనాలను ముట్టడించారు.తక్కువ వేతనాలు, ఇంధన పన్నుల పెంపుదలను తీవ్రంగా వ్యతిరేకించారు. యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఫ్రాన్స్ ప్రభుత్వంపై రైతుల ఆందోళతో ఒత్తిడి పెరుగుతోంది. గ్రామీణ సంఘాల డిమాండ్లపై శుక్రవారం ప్రకటన చేయొచ్చని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. రైతులు అన్ని ప్రధాన రహదారులు, రింగు రోడ్డులను దిగ్బంధించారు. మంగళవారం ఓ రైతు, ఆమె కుమార్తె మరణాన్ని తీవ్రస్థాయిలో నిరసించారు. ఓ వైపు ధరలు అమాంతం పెరిగిపోగా మరోవైపు వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. గోదుమ, మొక్కజొన్న, బీట్ రూట్ తదితర పంటల పండించే రైతులు తీవ్రస్థాయిలో ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులను వ్యతిరేకిస్తూ స్ట్రాస్‌బర్గ్‌లోని ఎం35 మోటార్‌వేను వందల మంది రైతులు దిగ్బంధించారు. అవిగ్నోన్, మెడిటేరియన్ పోర్ట్ మార్సిల్లే, బోర్డోయాక్స్ మార్గాలతో పాటు పశ్చిమ నగరమైన బోర్డియాక్స్‌లో ప్రధానమైన రింగ్ రోడ్డుకు ఇరు వైపులా 15 ట్రాక్టర్లను నత్తనడకన నడుపుతూ నిరసన తెలిపారు. తమను అన్ని వైపుల నుంచి ఒత్తిడికి గురిచేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. డీజిల్‌పై పన్ను మినహాయింపు ఎత్తివేయడంతో సహనాన్ని కోల్పోయి ఆందోళనకు దిగారు. రైతులను శాంతింపజేసేందుకు డీజిల్ పన్నులో కొత్త రిబేట్ కోసం ప్రభుత్వం యత్నించవచ్చు. కాగా పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని కొందరు శాసనసభ్యులు సూచించారు. ఏదిఏమైనా శుక్రవారం వరకు ప్రకటన చేయకుండా ఆగడం ప్రభుత్వానికి అంత మంచిది కాదని కోఆర్డినేషన్ రూరలే యూనియన్ సహ అధ్యక్షుడు కరీన్ డక్ వెల్లడించారు. తక్షణమే సంక్షోభ రంగాలను ఆదుకోవాలని, చెల్లింపులు జరపాలని, ఆంక్షలను సడలించాలని రైతుల అగ్ర సంస్థ 'ఎఫ్ఎన్ఎస్ఈఏ' డిమాండ్ చేసింది. ఇదంతా కొన్ని వందల మిలియన్ల యూరోలతో కూడుకున్న వ్యవహారంగా ఎఫ్ఎన్ఎస్ఈఏ అధ్యక్షుడు అర్నానౌడ్ రూసో అన్నారు. రైతుల డిమాండ్ల పరిష్కారానికి ఆయన డిమాండ్ చేశారు.

భారత్‌తో కయ్యం పెట్టుకోవద్దు

మాల్దీవుల అధ్యక్షుడికి ప్రతిపక్షాల సూచన

మాలె: భారత్‌తో కయ్యానికి కాలు దువ్వడం మంచిది కాదని మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జుకు ప్రతిపక్ష పార్టీలు సూచించాయి. ఈ వివాదం తమ దేశ అభివృద్ధికే చేటన్నాయి.

చైనా పరిశోధక నౌకను మాల్దీవుల తీరంలో నిలిపే అనుమతులు జారీ క్రమంలో అధ్యక్షుడిని తీరు మార్చుకోకుంటే ప్రమాదం తప్పబోదని విపక్ష మాల్దీవియన్ డెమొక్రటిక్ పార్టీ (ఎండీపీ), ది డెమొక్రాట్స్ హెచ్చరించాయి. దీర్ఘకాల మిత్రదేశాన్ని దూరం చేసుకోవడం మంచిది కాదని పేర్కొన్నాయి. 'విదేశాంగ విధాన వైఖరి'ని ఎత్తిచూపాయి. హిందూ మహా సముద్రంలో శాంతి, సుస్థిరత మాల్దీవుల భద్రతకు చాలా కీలకమని గుర్తుచేశాయి. ఎండీపీ చైర్మన్ ఫయాజ్ ఇస్మాయిల్, పార్లమెంట్ డిప్యూటీ స్పీకర్ అహ్మద్ సలీమ్, డెమొక్రాట్స్ అధిపతి హసన్ లతీఫ్, పార్లమెంటరీ గ్రూప్ నేత అలీ అజీమ్ ఇటీవల సంయుక్తంగా నిర్వహించిన మీడియా సమావేశంలో పై వ్యాఖ్యలు చేశారు. మార్చి 15కల్లా తమ భూభాగం నుంచి భారత్ దళాలు వైదొలగాలని ముయిజ్జు తేల్చిచెప్పారు. దీంతో రెండు దేశాల మధ్య వివాదం మొదలైంది. భారత సైన్యం స్థానంలో చైనా దళాలు ప్రవేశించే అవకాశముంది. లక్షద్వీప్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ పర్యటనపై మాల్దీవుల మంత్రులు ముగ్గురు విమర్శలు చేయడంతో వివాదం ముదిరింది. చైనా పరిశోధక నౌకను మాల్దీవుల తీరంలో నిలపడానికి అనుమతించడంపైనా భారత్ అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఎన్నికలకు వైసీపీ 'సిద్ధం'

(మొదటిపేజీ తరువాయి)

వీడేందుకు సిద్ధమయ్యారు. టీడీపీ అధినేత చంద్రబాబుతో ఆయన సంప్రదింపులు చేపట్టినట్లు తెలిసింది. ఇదే సమయంలో మిగిలిన అసంతృప్త ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఆయన కూడగట్టి వారితోపాటు టీడీపీలోకి భారీగా నేతలను చేర్పించే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. దీనిపై వైసీపీ అసమ్మతి ఎమ్మెల్యేల నుంచి పూర్తి స్థాయిలో స్పష్టత రావడం లేదు. ఇప్పటికే పార్థసారథితో వైసీపీలో టికెట్లు లభించని ఎమ్మెల్యేలు రక్షణనిధి, ఎలీజా, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టచ్‌లో ఉన్నారు. వారి ముగ్గురితో పాటు మంత్రి జయరామ్, నరసారావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాలు మూకుమ్మడిగా టీడీపీలోకి ఒకేసారి చేరి, వైసీపీ పెద్ద షాక్ ఇస్తారన్న ప్రచారం ఉంది. ఒంగోలు ఎంపీ మాగుంటకు వైసీపీ నుంచి టికెట్ లేదన్న సమాచారం రావడంతో ఆయన కూడా పక్కచూపులు చూస్తున్నారు. వీలైనంత వరకు సీఎం జగన్ ఎన్నికల ప్రచారం ప్రారంభించే రోజునే వారంతా టీడీపీలోకి వెళ్లి, వైసీపీ బలహీన పడిందన్న సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆరోజు వీలు కాకుంటే మరోరోజు భారీ బహిరంగ సభతో వైసీపీ అసంతృప్త ఎమ్మెల్యేలు, నేతలు టీడీపీలో చేరతారని తెలిసింది. అటు టికెట్లు దక్కక అసంతృప్తితో ఉన్న ఎమ్మెల్యేలను వైసీపీ నేతలు ప్రోత్సహిస్తున్నారు. కొంతమంది మెత్తబడగా, మరికొందరు అసంతృప్తితోనే ఉన్నారు. తాజాగా విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పార్టీ నిర్ణయాన్ని కట్టుబడి ఉంటానని ప్రకటించారు. విజయవాడ సెంట్రల్ సీటును వెలంపల్లి శ్రీనివాస్‌కు కేటాయించిన విషయం విదితమే. విజయవాడ సెంట్రల్ నియోజవర్గ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి మల్లాది విష్ణు స్వయంగా హాజరయ్యారు. మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ అసంతృప్తి వీడలేదు. అభివృద్ధి పనులకు బిల్లులు రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆయన కూడా పార్టీ మారతారన్న ప్రచారం ఉంది. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులురెడ్డి కూడా ఆ జిల్లాలో తన అనుచరులకు టికెట్లు ఇవ్వకపోవడంపైన అసంతృప్తితో ఉన్నారు. ఈ అసంతృప్తులు, ఇన్‌ఛార్జ్‌ల మార్పుల నడుమ సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభలు కొనసాగనున్నాయి. ప్రాంతీయ సభలు పూర్తయిన వెంటనే అసంతృప్త ఎమ్మెల్యేలు, నేతలను సీఎం జగన్ బుజ్జగించనున్నారు.

గిరిజన ప్రాంతాల్లో 300 సెల్‌టవర్లు

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉంటుందని చెప్పారు. ఇవన్నీ వేగవంతంగా, సమర్థవంతంగా, పారదర్శకంగా జరగడం కోసం ఈ కనెక్టివిటీ చాలా అవసరమని భావించి ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని జగన్ చెప్పారు. గ్రామ సచివాలయాలు, ఆర్బీకే వ్యవస్థలు, విలేజ్ క్లినిక్‌లు, నాడు నేడుతో బాగుపడుతున్న ఇంగ్లీషు మీడియం స్కూళ్లు గ్రామాన్ని, గ్రామ రూపురేఖలు మార్చే దిశగా పడుతున్న అడుగులేనని సీఎం వివరించారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని, పారదర్శకంగా ప్రతి ఇంటికీ అందాలన్న తపన, తాపత్రయంతో గతంలో 100 టవర్లతో కలిపి మొత్తం 400 టవర్లను దాదాపు రూ.400 కోట్ల పెట్టుబడితో నిర్మించుకున్నామన్నారు. ఇవిగాక మరో 2,400 టవర్లను రానున్న కాలంలో వేగంగా తీసుకొస్తామన్నారు. దాదాపు 2900 టవర్లు ఏర్పాటు చేయడం ద్వారా 5,459 ఆవాసాలను కనెక్టివిటీలోకి తీసుకొచ్చే బృహత్తర ప్రణాళిక అమలు చేస్తున్నామని, ఇందుకోసం సుమారు రూ.3119 కోట్లతో ఈ కార్యక్రమానికి కార్యాచరణ రూపొందించామన్నారు. దీన్ని సఫలీకృతం చేసేందుకు కేంద్రంతో మాట్లాడి ఇందులో భాగస్వామ్యం చేసేందుకు ఒప్పించామన్నారు. టవర్ల ఏర్పాటుకు అవసరమైన భూములను 2,900 ప్రాంతాల్లో ఇప్పటికే ఇచ్చామని సీఎం వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, సీఎస్ డాక్టర్ కేఎస్ జవహర్ రెడ్డి, ఐటీశాఖ కార్యదర్శి కోన శశిధర్, కమ్యూనికేషన్స్ (ఐటీశాఖ) డైరెక్టర్ సి.చంద్రశేఖర్‌రెడ్డి, భారతీ ఎయిర్‌టెల్, రిలయెన్స్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగ్గురు తెలుగువారికి 'పద్మశ్రీ'

(మొదటిపేజీ తరువాయి)

ఉమామహేశ్వరి డి : మొదటి మహిళా హరికథా ఘట్టం, సంస్కృత పారాయణంలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించింది.
గడ్డం సమ్మయ్య : జనగాంలోని ప్రముఖ చిందు యక్షగానం రంగస్థల కళాకారుడు, ఈ గొప్ప వారసత్వ కళారూపాన్ని 5 దశాబ్దాలకు పైగా 19,000 ప్రదర్శనలు ఇస్తున్నారు.
దాసరి కొండప్ప : నారాయణపేటలోని దామరగిద్ద గ్రామానికి చెందిన మూడో తరం బుర్ర వీణ వాద్యకారుడు కళారూపాల పరిరక్షణకే తన జీవితాన్ని అంకితం చేశారు.

భాగబత్ పదాన్ - ఒడిశా
సనాతన్ రుద్ర పాల్ - పశ్చిమ బెంగాల్
భద్రప్పన్ ఎం - తమిళనాడు
జోర్డాన్ లేప్చా - సిక్కిం
మచిహన్ సాసా - మణిపుర్
శాంతిదేవీ పాసవాన్, శివన్ పాసవాన్ - బిహార్
రతన్ కహార్ - పశ్చిమ బెంగాల్
అశోక్ కుమార్ బిశ్వాస్ - బిహార్
బాలకృష్ణన్ సాధనమ్ పుథియ వీతిల్ - కేరళ
బాబూ రామ్‌యాదవ్ - ఉత్తర్‌ప్రదేశ్
నేపాల్ చంద్ర సూత్రధార్ - పశ్చిమ బెంగాల్

సామాజిక సేవా విభాగం
సోమన్న - కర్నాటక
పార్బతి బారువా - అస్సాం
జగేశ్వర్ యాదవ్ - చత్తీస్‌గఢ్
ఛామి ముర్మూ - ఝార్ఖండ్
గుర్విందర్ సింగ్ - హరియాణా
దుఖు మాఝీ - పశ్చిమ బెంగాల్
సంగ్థాన్‌కిమా - మిజోరం

వైద్యవిభాగం
హేమచంద్ మాంఝీ - ఛత్తీస్‌గఢ్
యజ్డీ మాణెక్ షా ఇటాలియా - గుజరాత్
ప్రేమ ధన్‌రాజ్ - కర్ణాటక

క్రీడా విభాగం
ఉదయ్ విశ్వనాథ్ దేశ్‌పాండే - మహారాష్ట్ర

ఇతర విభాగాలు
యనుంగ్ జామోహ్ లెగో - అరుణాచల్ ప్రదేశ్
సర్బేశ్వర్ బాసుమతరి - అస్సాం
సత్యనారాయణ బెలేరి - కేరళ
కె.చెల్లామ్మళ్ - అండమాన్ నికోబార్

'మేము రాక్షసులం కాదు'

ప్రాథమిక హక్కులను సవాల్ చేసే వ్యాజ్యంపై సుప్రీం

న్యూఢిల్లీ : రాజ్యాంగంలోని అధ్యాయం-3కు చెందిన ఆర్టికల్ 20, 22 కింద పౌరులకు అందించిన ప్రాథమిక హక్కులను అధికారాలకు మించి ప్రకటించాలనే కోర్టు తీర్పును కోరిన వివాదాస్పద ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకోవడానికి పిటిషనర్‌ను అనుమతిస్తూ 'మేము రాక్షసులం కాదు' అని సుప్రీం కోర్టు గురువారం వ్యాఖ్యానించింది. న్యాయవాది నరేష్ కుమార్ ద్వారా తమిళనాడు నివాసి పి.కె.సుబ్రమణియన్ ఈ వ్యాజ్యం దాఖలు చేశారు. అటువంటి పిటిషన్లకు అడ్వకేట్స్ ఆన్ రికార్డ్ (ఏవోఆర్ఎస్) వారి సంతకాన్ని పట్టించుకోకుండా జోడించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్టికల్ 20 నేరాలకు సంబంధించిన నేరారోపణకు సంబంధించి రక్షణతో వ్యవహరిస్తుండగా, ఆర్టికల్ 22 నిర్దిష్ట కేసులలో అరెస్టు, నిర్బంధానికి వ్యతిరేకంగా రక్షణకు సంబంధించినది. రెండూ ప్రాథమిక హక్కులతో వ్యవహరించే రాజ్యాంగంలోని మూడవ అధ్యాయంలో చేర్చబడ్డాయి. రికార్డులో ఉన్న న్యాయవాది మాత్రమే సుప్రీం కోర్టులో ఒక పక్షం వాదించడానికి అర్హులు. 'అడ్వకేట్‌లు-ఆన్-రికార్డ్‌ను కేవలం సంతకం చేసే అధికారాలుగా తగ్గించలేమని అక్టోబరు 31, 2023న సుప్రీం కోర్టు స్పష్టం చేసింది.

సామాజిక, ఆర్థిక ప్రగతికి ఓటు దోహదం

వినియోగించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత

జాతీయ ఓటర్ల దినోత్సవంలో గవర్నర్ అబ్దుల్ నజీర్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: సామాజిక, ఆర్థిక ప్రగతిని నిర్దేశించే విలువైన సాధనమే ఓటు అని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఓటు అనే ఆయుధం ద్వారా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నారు. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గురువారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవంలో సీఎస్ జవహర్ రెడ్డి, సీఈవో ముకేష్ కుమార్‌తో కలిసి గవర్నర్ పాల్గొన్నారు. ఓటరు నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కలెక్టర్లకు పురస్కారాలు అందజేశారు. యువ ఓటర్లకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. భవిష్యత్‌కు పునాది వేసే ప్రజాస్వామ్య ఉత్సవంలో ఓటర్లందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. 'ఓటు హక్కు ద్వారా దేశ భవిష్యత్‌ను మార్చడంలో ప్రతి పౌరుడిదీ ప్రధాన పాత్ర. ఓటు వేయడం అనేది పౌరుడి ప్రధాన బాధ్యత కూడా. దేశ అభివృద్ధి గమనాన్ని నిర్దేశించడంలో పౌరులంతా తమ బాధ్యత నెరవేర్చాలి. సామాజిక, ఆర్థిక ప్రగతిని నిర్దేశించే విధానాలు సక్రమంగా ఉండాలంటే పౌరులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటు అనే వెలకట్టలేని విలువైన ఆయుధంతో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలి. మన ప్రతినిధిని ఓటు ద్వారా ఎన్నుకోవడం అంటే మన హక్కులను మనం రక్షించుకోవడమే. భవిష్యత్‌కు పునాది వేసే ప్రజాస్వామ్య ఉత్సవంలో ఓటర్లంతా పాల్గొనాలి' అని గవర్నర్ కోరారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ జాతీయ ఓటర్ల దినోత్సవమనేది ప్రజాస్వామ్య వ్యవస్థ పునాది పట్ల మన బాధ్యతను గుర్తుచేసే బృహత్తర కార్యక్రమమన్నారు. ఓటరు, ఎన్నికల ప్రక్రియ అనేవి ప్రజాస్వామ్య వ్యవస్థ ఔన్నత్యాన్ని ప్రతిబింబించే అంశాలని, ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోవడం ద్వారా జాతి నిర్మాణంలో కీలకపాత్ర పోషించాల్సిన బాధ్యతను ఈ కార్యక్రమం చాటిచెబుతోందన్నారు. రాష్ట్రంలో పురుష ఓటర్లు కంటే మహిళా ఓటర్లు ఎక్కువగా ఉన్నారని చెప్పడానికి సంతోషంగా ఉందన్నారు. ప్రతి వెయ్యి మంది పురుష ఓటర్లకు 1,036 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. తుది జాబితా ప్రచురణతో ప్రక్రియ ఆగిపోలేదన్నారు. ఎన్నికల ముందు వరకు నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. మిగిలిన యువ ఓటర్ల నమోదుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఓటర్ల జాబితా రూపకల్పనతో పాటు ఎన్నికలకు సంబంధించిన ఇతర అంశాల్లో ప్రతిభ కనబరిచిన డీఈవోల దగ్గరి నుంచి క్షేత్రస్థాయి బీఎల్‌వోలను సత్కరిస్తున్నట్లు వెల్లడించారు. భారత్‌లో ప్రాతినిధ్య ప్రజాస్వామ్యం ఉందని, ఇందులో ఓటు హక్కు చాలా కీలకమని రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి అన్నారు. ప్రజలకు ఓటు హక్కు కల్పించేలా మన ప్రజాస్వామ్యం రూపుదిద్దుకుందని తెలిపారు. 1949లో రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పుడే మనకు ఓటు హక్కు వచ్చేలా నిర్ణయం తీసుకున్నారన్నారు. 1989లో ఓటు హక్కు వయస్సును 21 నుంచి 18 ఏళ్లకు కుదించారని తెలిపారు. అధికారాలన్నీ ప్రజల వద్దే ఉన్నాయని, ఓటు హక్కు ద్వారానే అది నాయకత్వానికి బదిలీ అవుతుందని అన్నారు. ప్రజలకు ఓటు అనే సార్వభౌమాధికారం ఉందని, దేశాలు అభివృద్ధి చెందాలంటే ఓటు వేయడం చాలా ముఖ్యమని జవహర్‌రెడ్డి స్పష్టం చేశారు.

జగ్గయ్య చెరువు ఆక్రమణలు అరికట్టాలి

డేగా ప్రభాకర్ డిమాండ్

విశాలాంధ్ర-పిఠాపురం: అర్హులైన పేదలందరికీ ఇంటిస్థలాలు ఇవ్వాలని, జగ్గయ్య చెరువులో ఆక్రమణలు అరికట్టాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని జగ్గయ్య చెరువు ప్రాంతాన్ని పార్టీ నాయకులతో కలిసి ప్రభాకర్ గురువారం పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణవేణి, తహసీల్దారు టి.త్రినాథరావులను కలిసి సమస్యను వివరించారు. అనంతరం డేగా ప్రభాకర్ మాట్లాడుతూ జగ్గయ్యచెరువు ప్రాంతంలో గతంలో అనేకమంది పేదలకు ఇంటి స్థలాలు ఇచ్చారని, రాజీవ్ గృహకల్ప సముదాయం నిర్మించారని తెలిపారు. పేదవాడికి సొంతిల్లు ఓ కలని, ఇప్పటికీ పట్టణ పరిధిలో చాలామంది ఇల్లు లేని పేదలు ఉన్నారని, వారికి జగ్గయ్య చెరువు ప్రాంతంలో ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. ఆ ప్రాంతంలో అనధికారికంగా ఆక్రమ కట్టడాలు జరుగుతున్నాయని, అయినా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమార్కులు చెర నుండి ఆ స్థలాలను కాపాడలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకుంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. డేగా ప్రభాకర్ వెంట సీపీఐ నాయకులు బోడకొండ, అప్పలరాజు, రామకృష్ణ, గణపతి, దళితసంఘం నాయకులు ఖండపల్లి సుబ్బారావు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యానికి క్రీడలు అవశ్యం

ఆటల పోటీలు ప్రారంభించిన హరినాథరెడ్డి

విశాలాంధ్ర-తిరుపతి: ఏఐటీయూసీకి 104 సంవత్సరాల చరిత్ర ఉందని, స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు పి.హరినాథరెడ్డి పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏఐటీయూసీ అధ్వర్యంలో ఇక్కడి మెడికల్ కాలేజీ మైదానంలో మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్మికులకు క్రికెట్, కోకో, ముగ్గులు, కబడ్డీ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను గురువారం ఉద యం హరినాథరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా హరినాథరెడ్డి మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యానికి, ఐక్యతకు దోహదపడతాయన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ అందరూ కలిసి ఆటల పోటీలు నిర్వహించుకోవడం సంతోషకరమన్నారు. ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతూ... ప్రజలను చైతన్యపరుస్తూ ఉత్సాహంగా ఆటల పోటీలు నిర్వహిస్తూ అందరినీ కలుపుకుపోవడం ఏఐటీయూసీకే సాధ్యమని ఆయన అన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాధాకృష్ణ మాట్లాడుతూ కార్మిక ఐక్యత చాటడానికి ఆటల పోటీలు దోహదపడ తాయని, ఈ పోటీలు రెండు రోజులపాటు జరుగుతా యన్నారు. కార్మికులు, ఉద్యోగులు పాల్గొంటున్నారని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేయడంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటంలో భాగస్వాములు కావాలని, ఎర్రజెండా బాటలో అందరూ నడవాలని పిలుపునిచ్చారు. అందుకు ఏఐటీయూసీ సంపూర్ణ సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. శు క్రవారం సాయంత్రం బహుమతుల ప్రదానం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.మహేంద్ర, నాయకులు పాల్గొన్నారు.

తప్పుడు వాగ్దానాలతో ప్రజా వంచన

జగన్‌పై జగదీశ్ విమర్శలు

విశాలాంధ్ర బ్యూరో-అనంతపురం: రాష్ట్ర ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గత 56 నెలలుగా ప్రజలను మోసం చేస్తున్నారని...హామీలు ఇవ్వటమేగాని వాటిని అమలు చేసింది లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీశ్ విమర్శించారు. కామ్రేడ్ నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో ఆపార్టీ జిల్లా కార్యదర్శి జాఫర్, సహాయ కార్యదర్శులు నారాయణస్వామి, మల్లికార్జునతో కలిసి గురువారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ... సీఎం జగన్ పర్యటనలకు ప్రజా ధనాన్ని విపరీతంగా ఖర్చు చేస్తున్నారే గాని ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ నెరవేర్చిన ఆధారాలు లేవన్నారు. బీటీపీ ప్రాజెక్టు నిర్వాసితులకు రూ.208 కోట్ల పరిహారం ఇస్తామని సాక్షాత్తు సీఎం జగన్ ఇటీవల కళ్యాణ దుర్గం బహిరంగ సభలో ప్రకటించినా.... పూర్తిస్థాయిలో పరిహారం అందిన దాఖలాలు లేవని తెలిపారు. ఇక నాయి బ్రాహ్మణులు, శాలివాహనులు ఇతర వెనుకబడిన కులాలకు కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చి ఇప్పటికీ ఒక్క ఇటుక పెట్టిన పాపాన పోలేదన్నారు. ఈద్గా మసీదు, బీసీ రెసిడెన్షియల్ స్కూల్, అంబేద్కర్ భవన్ నిర్మాణాలకు స్థల సేకరణ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇదిలా ఉండగానే ఈ నెల 23 న ఉరవకొండ సభలో జీడిపల్లి ముంపు గ్రామాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద రూ.88 కోట్లు, హంద్రీ నీవా ద్వారా 75 వేల ఎకరాలకు సాగునీటిని అందించే డిస్ట్రిబ్యూటరీ పనుల కోసం రూ.65 కోట్లు, పెన్నహోబిలం వద్ద బీసీ బాలుర రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి రూ.33 కోట్లు, గుంతకల్లు నియోజక వర్గ పరిధిలోని 12 చెరువులకు నీరు పారించేందుకు రాగులపాడు వద్ద కాలువ నిర్మాణానికి రూ.20 కోట్లు ఇస్తానంటూ ప్రజాసమక్షంలో పచ్చి అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. హంద్రీ నీవా ద్వారా నీరు పారించే క్రమంలో ఇప్పటి వరకు 34 ప్యాకేజీలు ఉన్నాయని పైగా 36 వ ప్యాకేజీ ఆమోదానికి వెళ్లిందని గుర్తు చేశారు. వాటిని రద్దు చేయకుండా 75 వేల ఎకరాల సాగుకు రూ.65 కోట్లు ఇస్తానని చెప్పడం సీఎం జగన్ బోగస్ మాటలకు నిదర్శనమని మండిపడ్డారు. రాగుల పాడు వద్ద కాలువ నిర్మాణానికి రూ.45 కోట్లు మంజూరు చేసినట్లు రెండేళ్ల క్రితమే జీవో విడుదల చేయడం, టెండర్ ప్రక్రియ పూర్తి చేసుకుని కాంట్రాక్టర్ సైతం పనులు చేసేందుకు సిద్ధమయ్యాడని... అయితే భూ సేకరణ జరుగక పోవడం, నిధులు విడుదల కాకపోవడంతో ఒక్క అడుగు కూడా పనులు ముందుకు సాగలేదని చెప్పారు. ఫిబ్రవరిలో ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైతే ఏ ఒక్క పని జరగదని తెలిసే సీఎం జగన్ ప్రజలను వంచించెందుకు తప్పుడు వాగ్దానాలు చేస్తున్నారని, ప్రజలందరూ ఆలోచించాలని కోరారు. జాఫర్ మట్లాడుతూ సీపీఐ, టీడీపీ, జనసేన పార్టీలవైపు మొగ్గు చూపుతున్న వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించకుండా కేవలం వైసీపీ అనుయాయులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు మంజూరు చేస్తున్నారని ధ్వజమెత్తారు. నాలుగున్నరేళ్లలో సీఎం జగన్ 12 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అథోగతి పాలు చేశారని దుయ్యబట్టారు. ఆయన అమలు చేసిన సంక్షేమ పథకాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాములు,నారాయణ స్వామి, రాజేష్ గౌడ్, సంతోష్ కుమార్, కుల్లాయ్ స్వామి, రమణయ్య పాల్గొన్నారు.

చేనేత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు విజయవంతం

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-మంగళగిరి: చేనేత రాష్ట్ర 13వ మహాసభలు విజయవంత మయ్యాయని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని వేములపల్లి శ్రీకృష్ణ భవన్ సంఘం రాష్ట్ర కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక శ్రీమార్కండేయ పద్మశాలి కళ్యాణ మండపంలో రెండు రోజులపాటు జరిగిన చేనేత రాష్ట్ర మహాసభలు విజయవంతమయ్యేందుకు సహకరించిన చేనేత కార్మిక సంఘం కార్మికులు, నాయకులకు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులకు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో స్వీపర్‌గా పని చేస్తున్న రమణమ్మకు చేనేత కార్మిక సంఘం నాయకులు చీర అందజేశారు. కృతజ్ఞతలు తెలియజేసిన వారిలో ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గజవల్లి వెంకటకృష్ణ, బత్తూరి మోహన్‌రావు, మంగళగిరి మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందం బ్రహ్మేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, ఏపీ చేనేత కార్మిక సంఘం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి దొడ్డి ఈశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు గోలి వెంకటేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు బండి నాగేంద్రరావు, చేనేత నాయకులు శివప్రసాద్ ఉన్నారు.

విశాఖ పోర్టు నూతన రికార్డులు

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: విశాఖ పట్నం పోర్టు అథారిటీ జనవరి నెలలో రెండు నూతన రికార్డులు నెలకొల్పింది. గతంలో నెలకొల్పిన రికార్డులను తిరగరాసింది. 10,125 టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను 844 టన్నుల గ్యాంగ్ హుక్ అవుట్ పుట్ సామర్థ్యంతో ఈస్ట్ క్యూ 4 బెర్త్‌లో ఎంవీ ఎవరెస్ట్ కె నౌకలోకి ఎక్కించడం ద్వారా జనవరి 23న ఈ రికార్డును నెలకొల్పింది. ఉత్కల్ అల్యుమినా ఇంటర్ నేషనల్ సంస్థ ఈ షిప్ ద్వారా సరుకును ఎగుమతి చేసింది. గత ఏడాది డిసెంబరు 23న 8,379 టన్నుల కాల్సినెడ్ అల్యూమినాను 699 గ్యాంగ్ హుక్ అవుట్ పుట్ సామర్థ్యంతో ఈక్యూ 6 బెర్త్‌లో ఎంవీ ఫెయిత్ అనే నౌకలోకి ఎక్కించి రికార్డును నెలకొల్పింది. ప్రస్తుతం ఈ రికార్డును పోర్టు తిరగరాసింది. శ్రావణ్ షిప్పింగ్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ స్టివెడోర్స్‌గా వ్యవహరించగా ఇంటర్ ఓషన్ షిప్పింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ స్టీమర్ ఏజెంట్లుగా వ్యవహరించాయి. అలాగే ఈనెల 21న విశాఖపట్నం పోర్టు అథారిటీ మరో రికార్డును నెలకొల్పింది. దేశ్ విభోర్ అనే భారీ ఇంపోర్ట్ క్రూడ్ ట్యాంకర్‌ను పోర్టు హ్యాండిల్ చేసింది. దీని పొడవు 333 మీటర్లు భీమ్ 60 మీటర్లుగా ఉంటుంది. ఈ నౌక నుంచి హెచ్‌పీసీఎల్ కోసం 281142.257 టన్నుల క్రూడ్ ఆయిల్‌పే దిగుమతి చేసింది. గతంలో ఎలంద్రా డెనాలి అనే 329.99 మీటర్ల వెడల్పు, 60 మీటర్ల భీమ్ కలిగిన నౌక నుంచి 2,80,800 టన్నుల క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసిన రికార్డును ప్రస్తుతం తిరగరాసింది. ఈ ఘనతలను సాధించిన పోర్టు ట్రాఫిక్ సిబ్బందిని చైర్‌పర్సన్ డా.ఎం.అంగముత్తు అభినందించారు. మరిన్ని రికార్డులు నెలకొల్పడంతో పాటు మంత్రిత్వ శాఖ నిర్దేశించిన లక్ష్యానికి చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వివరాలను పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మీడియాకు వివరించారు.

పాఠశాలల విద్యుత్ బిల్లులు ప్రభుత్వమే భరించాలి: ఏపీటీఎఫ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని పాఠశాలల విద్యుత్ బిల్లులను ప్రభుత్వమే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.హృదయ రాజు, ఎస్.చిరంజీవి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం నేతలు ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యుత్ బిల్లుల విషయంపై మంత్రి బొత్స సత్యనారాయణకు విజ్ఞప్తి చేశామన్నారు. దీంతో ప్రభుత్వమే భరిస్తూ ఉత్తర్వులు జారీ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో వివిధ కారణాల రీత్యా విపరీతంగా వస్తున్న విద్యుత్ బిల్లులను చెల్లించేందుకు పాఠశాలల గ్రాంట్ సరిపోదని, ప్రభుత్వమే భరించాలని గతంలో మంత్రి బొత్సకు ఉపాధ్యాయ సంఘాలు విజ్ఞప్తి చేశాయని గుర్తు చేశారు. దీంతో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి బొత్స మాట్లాడి, ప్రభుత్వమే కడుతుందని వెల్లడించారని, త్వరలో మార్గదర్శకాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

కుటుంబ చీలిక...జగన్ స్వయంకృతమే

రాష్ట్ర దయనీయ స్థితికి ఆయనే కారణం

కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల

విశాలాంధ్ర-కాకినాడ: అభివృద్ధి లేకుండా రాష్ట్రం దయనీయ స్థితిలో ఉందంటే దానికి కారణం సీఎం జగనేనని రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. జిల్లాల పర్యటనలో భాగంగా గురువారం కాకినాడలోని సూర్య కళామందిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన షర్మిల మాట్లాడుతూ... రాష్ట్రాన్ని, తన కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ చీల్చిందంటూ బుధవారం సీఎం జగన్ చేసిన వ్యాఖ్యలపై స్పందించారు. "వైఎస్ కుటుంబం చీలిం దంటే దానికి కారణం.. చేజేతులా జగనన్న చేసుకున్నదే. అందుకు సాక్ష్యం దేవుడు, నా తల్లి విజయమ్మ, యావత్ కుటుంబం. పార్టీ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు 18 మంది ఎమ్మెల్యేలు రాజీనామా చేశారు. వాళ్లను మంత్రులను చేస్తానని చెప్పి మోసం చేశారు. పార్టీ కోసం నెలల తరబడి 3,200కి.మీ పాదయాత్ర చేశా. తెలంగాణలో ఓదార్పు యాత్ర చేపట్టా. సమైక్యాంధ్ర కోసం పాదయాత్ర కొనసాగించా. నా ఇంటిని, పిల్లలను పక్కన పెట్టి ఎండ, వానల్లో రోడ్ల మీదే ఉన్నా. ఎప్పుడు అవసరమొస్తే అప్పుడు స్వలాభం చూసుకోకుండా జగనన్న గెలుపునకు అండగా నిలబడి ప్రచారం చేశా. సీఎం అయిన రోజు నుంచి జగన్‌మోహన్‌రెడ్డి మారిపోయారు. నాకు వ్యక్తిగతంగా అన్యాయం చేసినా ఫర్వాలేదు.. రాజశేఖర్‌రెడ్డి పేరు, ఆశయాలు నిలబెడితే చాలు అనుకున్నా. జగన్‌తో పాటు ఆ పార్టీ వారంతా బీజేపీకి బానిసలుగా మారారు. ఒక్క ఎమ్మెల్యే, ఎంపీ లేకున్నా రాష్ట్రంలో బీజేపీ రాజ్యమేలుతోంది. రాష్ట్రానికి ఒక్క మేలు చేయకున్నా ఆ పార్టీకి ఎందుకు దాసోహమయ్యారు?" అన్నారు. తన తండ్రి, మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశించిన విధంగా వైసీపీ పాలనలో ప్రజలకు సంక్షేమం అందుతుందని తాను ఆశించగా... దానికి విరుద్ధంగా రాక్షస పాలనను జగన్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకహోదా కోసం ఏనాడూ జగనన్న ఉద్యమం చేయలేదని, కనీసం పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడిందీ లేదన్నారు. ఒక రాజధాని కాదు.. మూడు రాజధానులన్నారు. ఇవాళ అసలు రాజధాని ఉందా? లేదా? అనే అనుమానం కలుగుతోంది. ఆఖరికి విశాఖ స్టీల్‌ను కూడా బీజేపీకి పణంగా పెట్టారు. స్టీల్‌ప్లాంట్‌కు భూములిచ్చిన వారు ఉద్యోగాలు వస్తాయని ఎదురుచూస్తున్నారు. వైఎస్ ఆశయాలను నిలబెడతారని ప్రజలు జగన్‌ను సీఎంను చేశారు. ఆయన వారసులమని చెప్పడం కాదు... పనితీరులో అది కనపడాలి అని షర్మిల అన్నారు. రైతును రాజశేఖర్‌రెడ్డి నెత్తిన పెట్టుకున్నారని, ఆయన ప్రభుత్వంలో వ్యవసాయం ఒక పం డుగ అయితే ఇప్పుడు దండగగా మారిందని విమర్శించారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి దిగజారటానికి నాడు చంద్రబాబు, నేడు జగన్ తీరే కారణమన్నారు. వైసీపీ పాలనలో ఎమ్మెల్యేలు కేవలం కీలు బొమ్మలుగా మారారని షర్మిల ఆరోపిం చారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త ఒక సైన్యంగా పనిచేయాలని, ప్రజలకు వాస్తవాలు వివరించాలని కోరారు. ఈ ఏడాది జరిగే ఎన్నికలలో వైసీపీ, టీడీపీ, బీజేపీ, జనసేనలకు ఓట్లు వేయవద్దని పిలుపునిచ్చారు. సంక్షేమ పాలన, విభజన హామీలు అమలు చేసి రాష్ట్రానికి న్యాయం చేసే కాంగ్రెస్ పార్టీకే ఓట్లు వేయాలని షర్మిల చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, ఆ వెంటనే రాష్ట్రానికి అవసరమైన ప్రత్యేక హెూదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, విభజన హామీలు వంటి సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పల్లంరాజు, జేడీ శీలం, సుంకర పద్మశ్రీ, గిడుగు రుద్రరాజు, జంగా గౌతమ్, రఘువీరారెడ్డి, ఎస్ఎన్ రాజా, కామన ప్రభాకర రావు, చిలుకోటి పాండురంగారావు, ఆకుల లలిత, ఆకుల వెంకటరమణ, బాలేపల్లి మురళి, తుమ్మల దొరబాబు, దాట్ల గాంధీ రాజు తదితరులు పాల్గొన్నారు.



'కోడికత్తి' శ్రీను దీక్ష విరమణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: కోడికత్తి కేసులో బెయిల్ కోసం గత ఏడు రోజులుగా విశాఖ జైల్లో నిరాహార దీక్ష చేస్తున్న నిందితుడు జనపిల్లి శ్రీనివాసరావు గురువారం దీక్ష విరమించాడు. జైలు అధికారులు తీవ్ర ఒత్తిడి తేవడం తో తప్పని పరిస్థితుల్లో శ్రీను దీక్ష విరమించి నట్టు విశాఖ దళిత హక్కుల ఐక్య వేదిక రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ బూసి వెంకటరావు ప్రకటించారు. గురువారం ఉదయం జైల్లో శ్రీను ను కలిసిన వెంకట రావు అనంతరం జైలు వెలుపల మీడియాతో మాట్లాడారు. శ్రీను ఆరోగ్యం ఆందోళనకరంగా ఉందని, నిలబడలేని స్థితిలో తోటి ఖైదీ సహాయంతో ములాఖాత్‌కు వచ్చారని తెలిపారు. నాకు బలవంతంగా నిన్నటి నుంచి ఆసుపత్రిలో సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తున్నారు. అధికారుల ఒత్తిడి రోజురోజుకు పెరుగుతోంది. దీక్ష కొనసాగించే పరిస్థితి లేదు. సంఘ నాయకుల కు చెప్పి విరమించాలని అనుకుంటున్నానని శ్రీను తనను అడిగాడని వెంకట్రావు తెలిపారు. కోర్టులో సానుకూలత కనిపిస్తున్నందున దీక్ష విరమించాలని సలహా ఇచ్చినట్టు వెంకట రావు మీడియాకు వివరించారు. గత7 రోజులుగా దీక్షలో ఉన్న కారణంగా అతనికి ప్రత్యేక ద్రవరూప ఆహారం అందించాలని, మెరుగైన వైద్యం కోసం బయట ఆస్పత్రికి తరలించాలని వెంకట రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో ఎస్ఆర్ వేమన, సొదడాసి సుధాకర్, శామ్యూల్ కుమార్, కొత్తపల్లి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అస్త్రం షర్మిల

- కుటుంబం పదవులు పంచుకుంటుందా?
- జగన్‌ను వేధించిన కాంగ్రెస్
- ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: చంద్రబాబు స్క్రిప్టునే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారిలా షర్మిల బట్టీ పట్టీ మరీ చదువుతోందని ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. పదవుల పంపకంలో షర్మిలకు అన్యాయం చేశారా?, కుటుంబం పదవులు పంచుకోవడానికి ఉందా?, అది సబబేనా? అని సజ్జల సూటిగా ప్రశ్నించారు. తనను కలిసిన మీడియా ప్రతినిధులతో గురువారం సజ్జల మాట్లాడుతూ కాంగ్రెస్ నేత షర్మిల చేసిన వ్యాఖ్యలకు దీటుగా బదులిచ్చారు. అధికారంలో భాగస్వామ్యాలు ఉంటాయా? అది చర్చించడానికి కూడా అర్హమైనదేనా? అని అన్నారు. అలాంటప్పుడు అది ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది? రాజకీయ పార్టీ ఎలా అవుతుంది? అని నిలదీశారు. షర్మిల అకస్మాత్తుగా రాష్ట్రంలో రాజకీయ తెరమీద ప్రత్యక్షమయ్యారని, రావడం రావడమే తన మార్క్ కోసం విమర్శలు, వ్యంగాస్త్రాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఆమె మాట్లాడిన ప్రతి ఒక్క దానికి సమాధానం ఇవ్వాల్సిన అవసరం లేదని, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి, రాజకీయాల గురించి ఆమెకు ఏ మాత్రం అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదన్నారు. అందుకే ఆమె మాట్లాడే మాటల్లో ఒకదానికి మరో దానికి పొంతన ఉండటం లేదని, ఒక పోటీ పరీక్షకు బట్టీ పట్టి సిద్ధమైన పిల్లలు వచ్చి మాట్లాడుతున్నట్లు ఆమె ప్రసంగం కనిపిస్తోందన్నారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణంతో తట్టుకోలేక మరణించిన కుటుంబాలను పరామర్శించాలని ఓదార్పు చేపడితే అడ్డంగా కాంగ్రెస్ నిరాకరించిందని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆశయాలను తుంగలో తొక్కి, ఆయన పథకాలను కాంగ్రెస్ పక్కన పెట్టిందన్నారు. దాని తర్వాత కక్ష సాధింపు మొదలు పెట్టి వేధించిన విషయం షర్మిలమ్మకు తెలుసని, సోనియా గాంధీని కలిసినప్పుడు జగన్, విజయమ్మ, షర్మిలమ్మ ముగ్గురే ఉన్నారని, అక్కడేం జరిగిందో, వైఎస్సార్ కుటుంబాన్ని ఎంతగా వేధించారో ఆమెకు తెలుసని వివరించారు. షర్మిలకు ఏం అన్యాయం జరిగిందో ఆమె చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. వైఎస్సార్ పథకాలను తుంగలో తొక్కింది కాంగ్రెస్ పార్టీనే అని, వైఎస్సార్ ఆశయాలను నాడు సమాధి కట్టాలని చూశారన్నారు. ఆయన ఆశయాలను సజీవంగా ఉంచేందుకే జగన్ పార్టీ పెట్టారన్నారు. వైఎస్సార్‌కు జగనే సరైన వారసుడు అనుకున్నందునే ప్రజలు పట్టం కట్టారని స్పష్టం చేశారు. నాడు సాక్షాత్తు మోదీ సభలోనే ప్రత్యేక హోదా, విశాఖ స్టీల్‌పై జగన్ గళమెత్తారని, వైఎస్సార్టీపీలో ఉన్నప్పుడు మణిపూర్‌పై షర్మిల ఎందుకు మాట్లాడలేదని నిలదీశారు. వైఎస్సార్‌పై రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను షర్మిల ఎందుకు ప్రశ్నించలేదన్నారు. షర్మిల ఏపీలో రాజశేఖరరెడ్డి బిడ్డగా, జగన్ చెల్లిగానే తెలుసని అన్నారు. పార్టీ ఎదుగుదలలో లక్షలాది మంది కార్యకర్తల పాత్ర కూడా ఉందని స్పష్టం చేశారు. నాడు జగన్ అంతు చూడాలని కాంగ్రెస్ విశ్వప్రయత్నం చేసిందని వివరించారు. నేలకు కొట్టిన బంతిలా జగన్ కూడా పైకి ఎదిగారని, అందులో లక్షలాది కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు, నాయకులు అడుగులో అడుగు వేశారన్నారు. అందులో అందరి పాత్ర ఉందని, షర్మిల, విజయమ్మ పాత్ర కూడా ఉందని చెప్పారు. రాజకీయ పార్టీగా ఒక వ్యవస్థ తయారయ్యాక అధికారంలోకి వచ్చి నిలబడ్డాక అనేక నిర్ణయాలు తీసుకుంటుందని, అందులో అత్యంత పారదర్శకంగా న్యాయం చేసిన పార్టీ వైసీపీ అని స్పష్టం చేశారు. అందుకే ఈ రోజుకీ కార్యకర్తలు, నాయకులు ఆయనతో అచంచల విశ్వాసంతో అడుగులు వేస్తున్నారని తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలు అమలులోకి రాలేదని విమర్శించే ముందు... వైఎస్సార్ పేరుతో ఉన్న పథకాలు తీసుకున్న వాళ్లంతా ఎవరని సజ్జల ప్రశ్నించారు. షర్మిలను నమ్ముకుని తెలంగాణ రాష్ట్ర కార్యకర్తలూ నష్టపోయారన్నారు. రాజ్యసభ ఎన్నికల్లో బలం లేకుండా గేమ్ ఆడాలని చంద్రబాబు చూస్తున్నాడని మండిపడ్డారు.

సంపాదకీయం

ఉద్యమస్ఫూర్తి

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆంధ్రప్రదేశ్ పేరుతో ఎన్నో ప్రపంచ రికార్డులు నమోదయ్యాయి. అందులో ప్రధానమైనది 'రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ' ఘనత సాధించింది. ప్రపంచంలో రాజధాని లేని రాష్ట్రం ఏదైనా ఉందా అంటే అది ఆంధ్రప్రదేశ్ మాత్రమే. ఇటువంటి అరుదైన రికార్డును సాధించిన జగనన్న జగద్విఖ్యాతుడయ్యాడు. కనీసం మూడు రాజధానులు ప్రకటించిన మూర్ఖత్వానికి కట్టుబడి ఉన్నా పరువు దక్కేదేమో! అదీ లేదు..ఇదీ లేదు. ఈ తరహా పాలన కనీవినీ ఎరుగం, భవిష్యత్‌లోనూ కానరాకపోవచ్చు. తుగ్లక్ పాలనలోనూ రాజధాని గొడవ ఉందనేది చరిత్ర చెపుతోంది. ఢిల్లీ నుంచి దౌలతాబాద్‌కు రాజధానిని మార్చిన మహమ్మద్ బిన్ తుగ్లక్ అక్కడ రాజధాని భావన కలిగేందుకు లక్షలాది మంది ముస్లింలను బలవంతంగా అక్కడికి తరలించి చేతులు కాల్చుకున్నాడు. ఫలితంగా జిజియా వంటి పన్నులను రెట్టింపు చేయడానికి, ఆర్థిక వ్యవస్థ కుదేలుకావడానికి, రాజ్యం దివాళా తీయడానికి దారితీసింది. సరిగ్గా ఆనాటి పరిస్థితులే ఈనాడు జగన్ పాలనలో స్పష్టంగా గోచరిస్తున్నాయి. ఇదంతా ఎందుకు చెప్పాల్సి వచ్చిందంటే, రాజధానిగా అమరావతినే కొనసాగించాలని రైతులు చేపట్టిన ఉద్యమం 1500వ రోజుకి చేరింది. మట్టిమనుషుల మహాపోరుగా అభివర్ధిస్తున్న అమరావతి ఉద్యమం... కొన్నేళ్ల క్రితం మోదీ నల్లచట్టాలను నిరసిస్తూ ఢిల్లీని ముట్టడించిన రైతుల మహా ఉద్యమానికి ఏ మాత్రం తీసిపోని విధంగా సాగుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. రాజధాని మహోద్యమం '1500వ రోజు' మైలురాయిని చేరుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని వేలాది మంది రైతులు తమ పోరాటానికి మరోసారి పునరంకితమయ్యారు. ఈ సందర్భంగా జరిగిన భారీ బహిరంగ సభలో ప్రతిపక్షాలు సంఘీభావం తెలియజేసి, రైతుల పోరాటానికి మరోసారి ఊపిరిలూదారు. రాష్ట్ర విభజన తర్వాత అమరావతి పేరుతో రాజధానిని నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి వైసీపీతో సహా అన్ని పార్టీలూ మద్దతు పలికాయి. 29 గ్రామాల పరిధిలో ఉన్న 34,322 ఎకరాల భూములను 29881 మంది రైతుల నుంచి సమీకరించిన భూమిలో రాజధాని నిర్మాణానికి శ్రీకారం చుట్టిన మాట వాస్తవం. నిర్మాణం సాగుతున్న దశలో ఎన్నికలు రావడం, టీడీపీ ఓడిపోవడం, వైసీపీ గెలవడం, జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టడం, 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో సీఎం జగన్ ఏపీకి మూడు రాజధానులుంటాయని ప్రకటించడం రాజధానివాసులను కుదిపేసింది. ఆంధ్రప్రదేశ్ చిత్రపటానికి చిల్లులుపడ్డాయి. మరునాడే రాజధాని ఉద్యమం ప్రారంభమైంది. ఈ పోరు చినికి చినికి గాలివానలా మారుతుందని, సమరం సుదీర్ఘకాలం కొనసాగుతుందని పాలకులూ, పాలితులూ ఎవరూ ఊహించలేదు. అదే ఏడాది డిసెంబరు 31న తమకు కారుణ్య మరణాలకు అనుమతివ్వాలని కోరుతూ రైతులు రాష్ట్రపతికి లేఖలురాయడం, 2020 జనవరి 3న అమరావతి మహిళలపై మగ పోలీసుల అరాచకదాడిని ఖండిస్తూ రాజధాని గ్రామాలు బంద్ నిర్వహించడం, ప్రతిపక్ష నేత బస్సుయాత్ర, బైఠాయింపులు, వామపక్షాల సంఘీభావ ప్రదర్శనలు, బెజవాడ దుర్గమ్మకు ముడుపులు చెల్లించుకునేందుకు వెళ్తున్న మహిళలపై పోలీసులు దాడిచేసి, వారి జుట్టుపట్టుకొని లాగి, ఇనుపకంచె వేసి వారి ఒళ్లు చీరుకుపోయేలా పాల్పడిన అనైతిక చర్యలపై హైకోర్టు సూమోటోగా కేసు నమోదు చేయడం, 2020 జనవరి 20న అమరావతి జేఏసీ అసెంబ్లీ ముట్టడికి పిలుపునివ్వడంతో ముందస్తు అరెస్టులు జరిగినా, రైతులు, మహిళలు, రైతుకూలీలు, దళిత బహుజనులు రహస్యంగా అసెంబ్లీ వద్దకు చేరుకోవడం, ఈ సందర్భంగా మహిళలపై పురుష పోలీసులు విచక్షణారహితంగా విరుచుకుపడటం, 2020లో కరోనా సమయంలో ప్రపంచం యావత్తూ లాక్‌డౌన్‌కు వెళ్లిపోయినా అమరావతి ఉద్యమం ఆగకపోవడం, ఆ సమయంలో ఏప్రిల్ 7న జాతీయ రహదారి దిగ్బంధానికి ఇచ్చిన పిలుపు విజయవంతమవ్వడం, ఉద్యమం 200 రోజులకు చేరిన సందర్భంలో రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో దీక్షలు చేపట్టడం, 200 నగరాల నుంచి ఎన్‌ఆర్‌ఐలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి ఈ ఉద్యమానికి మద్దతు పలకడం, ఉద్యమం 300 రోజులకు చేరిన సందర్భంలో ప్రాణాలు కోల్పోయిన రైతులకు నివాళిగా తుళ్లూరులో భారీ యాత్ర నిర్వహించడం, 400 రోజులకు చేరిన సందర్భంలో రైతులు చేపట్టిన రాజధాని సంకల్ప యాత్ర విజయవంతం కావడం, అదే రోజు ఇన్సైడర్ ట్రేడింగ్ కేసు కొట్టివేయడం, ఉద్యమం 800 రోజులకు చేరినప్పుడు యువకులు పాదయాత్రలు, బైక్ ర్యాలీలు, ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో ప్రదర్శనలు నిర్వహించడం, 900 రోజుకు చేరిన సందర్భంలో రైతులు న్యాయదేవతకు క్షీరాభిషేకం చేయడం, రైతుగర్జన, జనభేరి...ఇలా రైతులు వివిధ రూపాల్లో చేసిన ఎన్నో ఆందోళన కార్యక్రమాలు ఈ అమరావతి ఉద్యమంలో మైలురాళ్లుగా నిలిచాయి. పేదల కోసం ఆర్-3 జోన్‌లో 2500 ఎకరాల భూముల్ని కేటాయించాలని చెపుతున్న మాస్టర్‌ప్లాన్‌ను చెడగొట్టే ప్రయత్నంగా సాఫ్ట్‌వేర్ కంపెనీలకు ఉద్దేశించిన ఆర్-5 జోన్‌ను పేదలకు కేటాయిస్తున్నట్లు చెప్పి పన్నిన కుయుక్తులను కోర్టు కొంతమేరకు అడ్డుకుంది. రాజధాని భూసేకరణలో టీడీపీ నాయకులు లక్షల కోట్ల రూపాయల ఇన్సైడర్ ట్రేడింగ్‌కు పాల్పడ్డారని చేసిన ఆరోపణలను హైకోర్టు కొట్టివేసినా జగన్ తీరు మారలేదు. విశాఖకు తరలిపోతున్నామంటూ అక్కడి భవనాలకు సున్నాలేసే రంగుడబ్బాల తరలింపునకూ అడ్డుపడింది. అయినా జగన్ గంతులాగలేదు, మూడుముక్కలాట ఆపలేదు.

దేశ చరిత్రలోనే అమరావతి ఉద్యమం సుదీర్ఘ సమరశీల పోరాటంగా నిలిచిపోయిందంటే అతిశయోక్తికాదు. అన్నదాతలపై ఖాకీల లాఠీలు కరాళనృత్యం చేసినా, గాయాలతో దేహాలు రక్తమోడినా, అక్రమ కేసులుపెట్టి జైళ్లలోకి కుక్కినా ఉద్యమం ఆగకపోవడం రైతుల పోరాటపటిమకు నిలువెత్తు నిదర్శనం. ఉద్యమ శిబిరంలో మహిళలు స్నానాలు చేస్తున్నప్పుడు పోలీసులు డ్రోన్ కెమెరాలు తిప్పి నిఘాపెట్టడం, దీన్ని అడ్డుకున్న 40 మంది రైతులపై కేసులు బనాయించి, 20 రోజులపాటు జైలులో నిర్బంధించడం, ఇప్పటివరకు 2600 మందిపై 600కిపైగా కేసులు పెట్టడం రాష్ట్ర ప్రభుత్వ నీచ, నికృష్ట, అరాచక చర్యలకు అద్దంపడతాయి. ఈ నాలుగేళ్ల ఉద్యమ కాలంలో దాదాపు 260 మంది అమరావతి రైతులు గుండెపగిలి చనిపోయినా కర్కశ సర్కారు కళ్లు తెరవలేదు. 2021లో న్యాయస్థానం నుంచి దేవస్థానం పేరుతో రైతులు తిరుమలకు చేపట్టిన 57 రోజుల పాదయాత్రకు రాయలసీమవాసులు నీరాజనాలివ్వడం, 1000 రోజుల మైలురాయి సందర్భంగా అమరావతి నుంచి అరసవిల్లి పాదయాత్రకు ఉత్తరాంధ్ర ప్రజలు హారతులివ్వడం అమరావతి రాజధానిపై యావత్ రాష్ట్ర ప్రజల ఏకోన్ముఖ వైఖరిని పునరుద్ఘాటించాయి. రాజధాని అంటే పాలకులకు రియల్‌ఎస్టేట్ వ్యాపారం కావచ్చు. కానీ రాష్ట్రానికి రాజధాని అనేది అనివార్యం, ప్రజలకు అవసరం. ఈ నగ్నసత్యాన్ని జగన్ రెడ్డి గ్రహిస్తారని ఆశించడం ప్రజల సహనాన్ని పరీక్షించడమే. అమరావతి రైతుల ఉద్యమస్ఫూర్తితో రాజధానిలో గోసలు తగ్గి గోడలు లేస్తాయని, నిర్మాణాలు మొదలవుతాయని ఆశిద్దాం!

రాజ్యాంగ నైతిక విలువలు ధ్వంసం



డి. రాజా,
సీపీఐ ప్రధాన కార్యదర్శి

1935 భారత వలస పాలన చట్టం స్థానంలో 1950 జనవరి 26న లాంఛనంగా భారత రాజ్యాంగం అమలులోకి వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా అలాగే భారతదేశ పౌరులు ఆధునిక సెక్యులర్, ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను ప్రకటించారు. స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం సార్వత్రిక ఆదర్శాలను ఎంపిక చేసుకున్నాం. అయితే, 2024 రిపబ్లిక్ దినోత్సవానికి ఆధునిక ప్రజాస్వామ్య భారతదేశాన్ని అపహాస్యానికి దిగజార్చింది. కేంద్ర ప్రభుత్వ అధ్వర్యంలో రామాలయ ఆవిష్కరణ జరపడం ద్వారా ఆధునిక ప్రజాస్వామ్య భారతదేశం అవహేళనకుగురైంది. దేశ రాజధాని ఢిల్లీలో షాపులు, ట్రాఫిక్ జంక్షన్‌లు, రోడ్లు, వీధులను కాషాయ జెండాలు ముంచెత్తాయి. రాముడి బొమ్మలు గల జెండాలు లెక్కలేనన్ని ఏర్పాటు చేశారు. త్రివర్ణ పతాకాలు ఎక్కడా కనిపించడంలేదు. ఈ పతాకాలు బ్రాహ్మణవాద, మనువాద, ఫాసిజానికి ప్రతీకగా పాలక పార్టీ ఏర్పాటు చేసింది. వీధుల్లో జెండాలు, బ్యానర్లు కట్టడం నూతన భారతదేశానికి గుర్తుగా ఆధిపత్య శక్తులు ప్రకటిస్తున్నాయి. ఈ భావజాలం మొదట నాగపూర్‌లో వలసవాదుల అనుచరులు హెగ్డేవార్, సావర్కర్ లాంటి కుల ఊహాజనితవాదులు నేటి పాలకులు అనుసరిస్తున్న విధానాలను కోరుకున్నారు. గాడ్సే వీరి అనుచరులే. విచ్ఛిన్నకర, విషపూరితమైన రాజకీయ పంథాను ఎంచుకున్నారు. అదేమిటంటే ఇండియాను హిందూరాష్ట్రంగా రూపొందించడం. సంఘ్‌పరివార్ రాజ్యాంగ విలువలన్నిటినీ ధ్వంసం చేసున్నది. ఈ దేశ ప్రజలు మహత్తర పోరాటం చేసి స్వాతంత్ర్యం పొందారు. సంఘ్‌పరివార్ శక్తులు అనుసరించబోయే విధానాలను రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ ముందుగానే హెచ్చరించారు. మన రిపబ్లిక్‌ను, ప్రజాస్వామ్య పునాదులను ధ్వంసం చేసి మతవాద రాజ్యంగా తయారుచేస్తారని అంబేద్కర్ ముందుగానే ఊహించారు. 2024 దేశ పరిస్థితిని ఒక సారి చూసినట్లైతే అంబేద్కర్ తీవ్ర విచారం వ్యక్తంచేసే వారు. మన ప్రధాని మెజారిటీ మతవాదులకు ప్రాతినిధ్యంవహిస్తూ భారత రాజ్యాంగ దార్శనికత కొనసాగకుండా ధ్వంసం చేస్తున్నారు.

దేశ ప్రభుత్వ అధినేత మోదీ నాయకత్వంలో ఒక పథకం ప్రకారం రామాలయ నిర్మాణం జరిగింది. భారతదేశ ప్రజాస్వామ్యం సుస్థిరంగా అభివృద్ధి చెందుతున్నది. ఈ సందర్భంగానే సెక్యులరిజాన్ని, రాజ్యాంగ విలువలను విచ్ఛిన్నం చేసేందుకు పూనుకున్నారు. రాజ్యాంగ అవతారిక మౌలిక విలువల స్థానంలో అసమానతలను నెలకొల్పేందుకు హిందూఇజంను స్థాపించేందుకు పూనుకున్నారు. హిందూరాష్ట్ర ఏర్పాటుకు తప్పుడు మార్గాన్ని అనుసరిస్తున్నారు. చరిత్ర ప్రమాణాలను విస్మరించి తీవ్రమైన అన్యాయాన్ని, హింసను అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ముందు సృష్టించారు. ఎంతో పకడ్బందీగా ఆలయాన్ని గొప్ప శిల్పచాతుర్యంతో నిర్మించారు. ఆలయ నిర్మాణానికి ముందు బాబ్రీమసీదు కూల్చివేసిన అనంతరం సుప్రీంకోర్టు ఆలయ నిర్మాణానికి ఆమోదం తెలిపింది. అయితే, న్యాయాన్ని ఉల్లంఘించి ఆలయ నిర్మాణం జరిగిందని అనేక మంది నిపుణులు తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు.



CONSTITUTION OF INDIA

WE, THE PEOPLE OF INDIA, having solemnly resolved to constitute India into a SOVEREIGN DEMOCRATIC REPUBLIC and to secure to all its citizens:

JUSTICE, social, economic and political;

LIBERTY of thought, expression, belief, faith and worship;

EQUALITY of status and of opportunity; and to promote among them all

FRATERNITY assuring the dignity of the individual and the unity of the Nation;

IN OUR CONSTITUENT ASSEMBLY this twenty-sixth day of November, 1949, do HEREBY ADOPT, ENACT AND GIVE TO OURSELVES THIS CONSTITUTION.

Signature of the artist Beohar Rammanohar Sinha as 'Ram'

రాజ్యాంగంతో మతానికి సంబంధంలేదని రచించినప్పటికీ దాన్ని ఉల్లంఘించి అట్టహాసంగా ఆలయ ప్రారంభాన్ని నిర్వహించడం విచారకరం. హిందూ సంప్రదాయాల ప్రకారం ఆలయాన్ని ప్రారంభించారు. అయితే, అనేక మంది రాజ్యాంగ నిర్వాహకులు ప్రధాని నరేంద్ర మోదీతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అన్నీతానై నిర్వహించి సెక్యులర్ విధానాన్ని తిరస్కరించి మెజారిటీ మతాన్ని తీసుకురావడానికి మోదీ సాగిస్తున్న పథకం అత్యంత ప్రమాదకరమైంది. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ కలిసి పథకం ప్రకారం ప్రజల విశ్వాసాలను ఆయుధపూరితం చేశాయి. న్యాయమైన, గౌరవనీయమైన సమాజాన్ని ప్రతీకారపూరితం చేస్తున్నారు. సోమనాథ ఆలయాన్ని ప్రారంభించేటప్పుడు ప్రధాని నెహ్రూ, చక్రవర్తుల రాజగోపాలాచారి, సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్‌ను కలుసుకుని ఆలయ ప్రారంభోత్సవానికి హాజరుకావద్దని కోరారు. నెహ్రూ ప్రత్యేకించి రాజేంద్రప్రసాద్‌కు ఒక లేఖ రాశారు. రాష్ట్రపతిగా ఏ ఆలయాన్నైనా సందర్శించవచ్చు, అయితే ఆలయ ప్రారంభోత్సవంలాంటి ప్రత్యేక కార్యక్రమాలకు రాష్ట్రపతిగా హాజరుకారాదు. నిర్దిష్టమైన మతవాదులు నిర్వహించే కార్యక్రమానికి హాజరుకావడం న్యాయబద్ధమైనది కాదు. అసంబద్ధమైన, ప్రమాదకరమైన సంప్రదాయం అవుతుంది అని ఆ లేఖలో నెహ్రూ పేర్కొన్నారు. అప్పుడు రాజేంద్ర ప్రసాద్ స్పందన ఈ విధంగా ఉంది. తాను రాష్ట్రపతిగా హాజరుకావడంలేదనీ, ఒక వ్యక్తిగా తాను పాల్గొంటానని తెలిపారు. అయితే, రాష్ట్రపతిగా ఉన్నప్పుడు ఆ పదవి, వ్యక్తి వేరని చూడడానికి వీలుకాదనీ, ఇలాంటి మత వేడుకలకు హాజరుకావడం కూడా వీలుండదని నెహ్రూ, రాజగోపాలాచారి, రాధాకృష్ణన్ స్పష్టంచేశారు. ఇలా హాజరుకావడం ఎవరూ అంగీకరించబోరని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని అవమానించేందుకు మోదీ కుట్రపన్నుతూ మరొక వైపు యథాలాపంగా అంబేద్కర్ సేవలను ప్రశంసిస్తారు. ఒకవైపు అంబేద్కర్‌ను అవమానిస్తూనే సమానత్వం, న్యాయం, విముక్తి భావాల నుంచి ఆయనను వేరు చేస్తున్నారు. అంబేద్కర్ తన రాజ్యాంగ ముసాయిదాలో దేశానికి ఎటువంటి మతాన్ని గురించి పేర్కొనలేదు. దేశంలో మైనారిటీలను బహిష్కరించడానికి పిలుపునిస్తే అది స్పష్టమైన హానిఅవుతుంది. ఆయన తన ముసాయిదాలో ఇలా పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక రంగాల పరిధి నుంచి మైనారిటీలను బహిష్కరించినట్లైతే అలా చేసిన వారు తీవ్రమైన నేరం చేసినట్లే. శిక్షార్హులవుతారు. భారతదేశ చట్టసభల నుంచి మైనారిటీలను బహిష్కరించిన వారిని కఠినంగా శిక్షించాలని, ఆ విధంగా చట్టాన్ని రూపొందించాలని అంబేద్కర్ సూచించారు. ప్రధానమంత్రి స్వయంగా న్యాయాన్ని ఉల్లంఘించే చర్యలు తీసుకున్నప్పుడు అంబేద్కర్ తీవ్రమైన విభ్రాంతికి గురయ్యేవాడు. ప్రధానితో సహా కేబినెట్ సహచర మంత్రులు సైతం రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నైతికతను ఉల్లంఘించారు. పౌరులు రాజ్యాంగ నైతికతను సమగ్రంగా కొనసాగించాలనీ, రాజ్యాంగం తప్పనిసరిగా అనుసరించి రాజ్యాంగాన్ని విజయవంతం చేయాలన్నారు. దీనికి భిన్నంగా ఇప్పుడు మితవాద శక్తుల పాలన కొనసాగుతోంది. అంబేద్కర్ చెప్పిన నైతికతలన్నీ వెనుకపట్టు పడుతున్నాయి.

ప్రస్తుతం పాలిస్తున్న ప్రభుత్వం సామ్రాజ్యవాద వ్యతిరేక, ఉప ఖండంలో ఫ్యూడల్ వ్యతిరేకత విధానాలను కావాలనే విస్మరిస్తున్నది. ఇప్పుడు పుక్కిటి పురాణాలను వల్లిస్తూ తప్పుడు అంశాలను, శాస్త్రవిరుద్ధమైన విషయాలను అనుసరిస్తున్నది. హిందూరాష్ట్ర విపత్తును ధిక్కరించి దేశ ప్రజలు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అయోధ్యలో జరిగిన కార్యక్రమం రాజ్యాంగ విలువలను హేళన చేసింది. అయోధ్యలో రామాలయ ప్రారంభం స్పష్టంగా పోరాటమార్గాన్ని తెలియజేసింది. భారీ బ్యానర్లు పేదల గుడిసెలు కనిపించకుండా వాటిని ధ్వంసం చేయడం, వారికి కనీసం నివాసాలు లేకుండా చేశారు. నకిలీ సైన్స్‌ను, పుక్కిటి పురాణాల చరిత్రను ప్రవేశపెడుతున్నారు. అత్యధిక నిరుద్యోగం, విద్యారంగాన్ని పూర్తిగా మార్చివేయడం, మహిళలపై అత్యాచారాలను, హింసను వ్యవస్థీకృతం చేస్తున్నారు. క్రూరత్వం పెరిగిపోతోంది. మహిళలు, దళితులు, ఆదివాసీలపైన హింస పెరుగుతోంది. మహిళా శ్రామిక భాగస్వామ్యం తగ్గుతోంది. చిన్నాచితక ఉద్యోగాలు చేసేవారు పెరుగుతున్నారు. మహిళలో రక్తహీనత పెరిగింది. ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) దిగజారిపోతోంది. రాజ్యాంగ ఔన్నత్యాన్ని కాపాడుకునేందుకు, తీవ్రమైన విపత్తు నుంచి రక్షించుకునేందుకు మనమంతా కలసికట్టుగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరాన్ని చరిత్ర, కాలం మనకు గుర్తుచేస్తున్నాయి.

భారత రాజ్యాంగం... పౌరుల బాధ్యతలు

చిన్నం కాళయ్య

భారతీయుడిగా, భారత పౌరులుగా ప్రతి ఒక్కరు భారత రాజ్యాంగం గురించి తెలుసుకోవలసి వుంది. "భారత రాజ్యాంగం" అంటే "యిలా వుండాలి మీరు" అని ఎవరో రాసిన గ్రంథం కాదు. ఇది 1949 నవంబరు 26వ తేదీన మనమే రాసుకుని, ఇకనుండి మేమిలా వుంటాం. సంపూర్ణ స్వాతంత్ర్యంతో ఎవరిమీదా ఆధారపడక ఒకరికి ఒకరు తోడ్పడుతూ జీవిస్తాం అని సర్వులకు తెలియ పరచిన చారిత్రక పత్రం. ఆనాటి నుంచి మనం అందరం, మనకు భారత రాజ్యాంగం గురించి తెలిసినా, తెలియక పోయినా, ఆ భారత రాజ్యాంగం అందించిన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు, మనసాటి ప్రజలకు మనంచేసిన ప్రమాణాలకు అనుగుణంగా జీవిస్తున్నాం. ప్రపంచ మానవాళికే ఆదర్శనీయమైన విధంగా మనం ఆనాడు రాసుకున్న భారత రాజ్యాంగమే మనలను పరిపాలిస్తూవుంది. కానీ మనం కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పాలిస్తున్నాయని అనుకుంటున్నాము. మనల్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పరిపాలించడంలేదు, మనల్ని మనమే పరిపాలించుకుంటున్నాం. అదే గణతంత్ర విధానం. మనం రాసుకున్న రాజ్యాంగం ప్రకారం మనకు పాలనా సేవలు అందించడానికి, భారత రాజ్యాంగంలో 15వ విభాగం ప్రకారం ఎన్నికల కమిషన్‌ని భారత ప్రథమపౌరుడు రాష్ట్రపతి నియమిస్తారు. ఆ ఎన్నికల కమిషన్ ప్రకారం ఎన్నికలను నిర్వహించగా గెలిచిన అభ్యర్థులను మనకు సేవలు అందించే మంత్రులుగా నియమించుకున్నాం.

భారత రాజ్యాంగాన్ని నిర్మించుకున్నది మనం అంటే మన భారత ప్రజలమే, భారత దేశాన్ని పాలించడానికి రాజులకన్నా మిన్నయైన నిర్ణాయక శక్తులం. మనంఓట్లు వేస్తేనే వారు మన పాలకులు అయ్యారు. మనం రాజులం అయితే వారు మన ప్రతి ఒక్కరికీ మంత్రులు, మనం అధికారులం అయితే వారు సేవకులు. మన వోటువేసి వారిని ఎన్నుకున్నాం. మనమే రాజ్యాంగం రాసుకున్నాం. మనమే పాలకులం. వారు మన సేవకులు అన్న ఆశయం మనకు మనం రాసుకున్న రాజ్యాంగం చేత దాఖలు పరిచినప్పటికీ, మనం ఆ అధికారిక విషయం మరచిపోయాం "పాలకులు" మనల్ని ఆ విషయాన్ని మరచిపోయేట్టు చేశారు. "మేము చెప్పేది మీరు వినండి. ప్రశ్నలు అడక్కండి. చెప్పింది చెయ్యండి.మమ్మల్ని ఎన్నుకున్నందుకు మేము ఏంచేసినా భరించాల్సిందే. లేకుంటే మీపైన లాఠీఛార్జ్ చేయిస్తాం. జైళ్లలో వేస్తాం" అనే దుష్టపరిస్థితి వచ్చింది. వారిని ఎన్నుకున్న ప్రజలుగా వారు మనకి తమ నిష్కళంక పరిపాలన ద్వారా అందించవలసిన విద్య, వైద్య, నివాస, ఉద్యోగం సౌకర్యాలు అందించకుండా రాజ్యాంగ యుతంగా మనకు దాఖలు అయిన ప్రాథమిక హక్కులుకూడా మనకి దక్కకుండా పరిపాలనను సాగిస్తున్నారు. మనలను కులమత ప్రాంతీయ భేదాలతో ఒక్కటి కాకుండా బలహీనులుగా చేస్తున్నారు. పనికిమాలిన సెక్సు దౌర్బల్య సంస్కృతిని, దురలవాట్ల సంస్కృతిని మనపైన రుద్దుతూ, మనల్ని అవిద్యలో మునిగేటట్టు అంధులుగా చేస్తున్నారు. తత్ఫలితంగా పేదలు మరింత పేదలుగా అణిచివేస్తున్నారు. మన భారత రాజ్యాంగానికి మనమే పరిరక్షకులం అన్న సంగతి మరచిపోయి రాజ్యాంగ ఆశయాలను, రాజ్యాంగ విధులను తెలుసుకోకుండా, రాజ్యాంగ రక్షణను పాలకులచేతుల్లో పెట్టబట్టే మనకు యీ విపత్కర పరిస్థితి వచ్చింది. మనం రాసుకున్న రాజ్యాంగ విలువల్ని మనమే మరచిపోతున్నాం. రాజ్యాంగ ప్రాతిపదికన కాకుండా, అత్యంత సంకుచితమైన మనకేకాదు, దేశానికే అత్యంత హానికరమైన కులమత మూఢదైవ విశ్వాసాల పరిధిలో జీవిస్తూ, వాటినే మనకు రక్షణగా భావిస్తున్నాం.వాటి మత్తులో పడిపోయి మనకుగల హక్కుల్నే మరచిపోయాం. దోపిడీకి ఎదురు తిరిగే హక్కు కూడా వుంది మనకు. అయినా మనం ఆ సంగతే పట్టనట్టుగా వుండిపోతున్నాం. అందువల్ల మనల్ని దోపిడీ చేయడం పాలకులకు చాలా సులువు అయింది. వ్యక్తి బాగుపడినప్పుడే, అతడి ప్రభావం అతడి చుట్టూ వున్నవారిపై పడి వారు కూడా చైతన్యవంతులుగా మారుతారు. అలా అందరూ చైతన్యవంతులుగా మారినప్పుడే వారిలో ప్రపంచాన్ని మార్చగల శక్తి ప్రపత్తులు ఏర్పడుతాయి.

సంఘాన్ని మార్చడానికి మనం సంఘ సమైక్యతకీ భంగం కలిగిస్తున్న మనువాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుంది. మరింత జ్ఞానవంతులం కావాల్సి ఉంది. ఏ సాయుధ పోరాటమో చేయక్కరలేదు. మనకు మనమే నిర్మించుకున్న భారత రాజ్యాంగమే మనకు అండదండలుగా వుంటుంది. మనమే చైతన్యవంతమైన పౌరులమై, నాయకులమై, ఏలికలమై, మనం కలలు కంటున్న సమాన సామాజిక వ్యవస్థను మనమే నిర్మించుకోవడానికి కృషి సాగించాలి. మన రాజ్యాంగం నిర్మించుకున్న పూర్వాపరాలను, రాజ్యాంగ ఆశయాలను మనం తెలుసుకోకపోతే, రాజ్యాంగ ఆశయాలను మనం నిత్య జీవితంలో పాటించకపోతే, మన భవిష్యత్తునే కాదు, రేపు మనకు కలిగే బిడ్డల, తరువాతి తరాల భవిష్యత్తునే నాశనం చేసుకున్న వాళ్లమవుతాము. ధనవంతులకు, దోపిడీగాళ్లకు మత మూర్ఖులకు శాశ్వతంగా బానిసలుగా మారిపోతాము. మనం రాజ్యాంగం గురించి తెలుసుకుని, ఆ విధంగా జీవితాలను మలచుకోవలసిన అవసరం, మునుపటికన్నా మనకు ఇప్పుడే ఎక్కువగావుంది. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ స్వాతంత్ర్య హీనులమై బానిసలుగా బతుకుతున్న దుర్భర పరిస్థితినే మనం ఎదుర్కొంటున్నాం. అందువల్ల మనం రాజ్యాంగ పూర్వాపరాలు, రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ సూత్రాలు వీటిని గురించి సాకల్యంగా తెలుసుకుందాం. ఇవన్నీ మనల్ని దేశ పరిస్థితుల్ని అవగాహన చేయించి,మనల్ని చైతన్యవంతులుగా చేస్తాయని అనడంలో సందేహం లేదు. పౌర చైతన్యంతోనే సంఘ చైతన్యం, సంఘచైతన్యంతోనే దేశచైతన్యం, దేశ చైతన్యంతోనే ప్రపంచంలో మనకు నిజమైన అభివృద్ధి, గుర్తింపూ, గౌరవం దక్కుతాయి. మన భారత రాజ్యాంగం మనకు అటువంటి చైతన్యాన్ని అందించే శక్తిని, పద్ధతులను, విశాల దృష్టిని కలిగివుంది. అటువంటి రాజ్యాంగం గురించి తెలుసుకొని, ఉన్నత చైతన్యంతో నిత్య నూతనంగా జీవిద్దాం. ఆ విధంగా మనలకి మనమే ప్రమాణం చేసుకుందాం.

దళిత హక్కుల పోరాట సమితి ప్రధాన కార్యదర్శి,
తిరుపతి జిల్లా

నిజమైన భారత రత్నం

ఆర్వీ రామారావ్

బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకుర్ మరణించిన తరవాత 36 ఏళ్లకు మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వానికి ఆయనతో మళ్లీ అవసరం పడింది. అందుకే కర్పూరీ ఠాకూర్‌కి భారత రత్న ఇస్తామని ప్రకటించారు. రామ్‌మనోహర్ లోహియా తరవాత సామాజిక న్యాయం గురించి ఎక్కువగా మాట్లాడిన వ్యక్తి కర్పూరీ ఠాకూరే. ఆయన సామాజిక న్యాయం కేవలం మాటలకు పరిమితం కాలేదు. వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు అమలు చేసిన మొదటి వ్యక్తి ఆయన. రెండు దఫాలుగా కలిపి ముఖ్యమంత్రి స్థానంలో ఆయన ఉన్నది రెండున్నరేళ్లే. మొదటిసారి ఏడు నెలలు అధికారంలో ఉంటే, రెండో దఫా 1977 జూన్ నుంచి 1979 జూన్ దాకా అధికారంలో ఉన్నారు. ఆ సమయంలోనే ఆయన రిజర్వేషన్లు అమలుచేసి సామాజిక న్యాయం అంటే ఏమిటో ఆచరణలో చూపించారు.

విచిత్రం ఏమిటంటే గత సోమవారం అయోధ్యలో రామమందిరంలో బాలరాముడి విగ్రహానికి అట్టహాసంగా ప్రాణ ప్రతిష్ఠ చేసి కమండల రాజకీయాలను అనుసరించిన ప్రధాన మంత్రి ఆ మరుసటి రోజే కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇస్తామని ప్రకటించడం ద్వారా మండల రాజకీయాల జెండా ఎత్తారు. కర్పూరీ ఠాకూర్ రెండో దఫా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు భారతీయ జనతా పార్టీకి పూర్వ రూపమైన భారతీయ జనసంఘ్ కూడా ఆ ప్రభుత్వంలో భాగస్వామి. కానీ కర్పూరీ ఠాకూర్ రిజర్వేషన్ల అమలు గురించి మాట్లాడగానే అప్పటి జనసంఘ్ ఆయన ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించింది. మోదీ క్షణాల్లో తన ఎత్తుగడలను మార్చేయగలరు. అందుకే ఇన్నేళ్ల తరవాత కర్పూరీ ఠాకూర్‌ను తలచుకుని భారతరత్న ఇవ్వాలని నిర్ణయించారు. కమండల్ ఎప్పుడు వదలాలో మండల్ రాజకీయాలను ఎప్పుడు ఆశ్రయించాలో మోదీకి తెలిసినట్టుగా మరెవరికీ తెలియదు. గతంలో కర్పూరీ ఠాకూర్‌ను ఎంత మాత్రం ఆదరించని బీజేపీ ఇప్పుడు ఆయనను తలకెత్తుకుంటోంది. కేవలం కమండల రాజకీయాలు 2024 సార్వత్రిక ఎన్నికలలో బీజేపీని గట్టెక్కించలేవని మోదీ గ్రహించారు. మండల్ కమిషన్ ఊసే లేనప్పుడే కర్పూరీ ఠాకూర్ వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్ల అవసరాన్ని గుర్తించారు.

బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ కుల గణన చేయించినప్పుడు ఇదే బీజేపీ ఆయనను తూలనాడింది. ఆ తరవాత "ఇండియా" ఐక్య సంఘటన కులగణనను సమర్థిస్తే బీజేపీ గంగ వెర్రులెత్తినట్టు ప్రవర్తించింది. ఆ పార్టీకి పుండు మీద కారం చల్లినట్టు అయింది. కుల గణనను బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కుల గణనను సమర్థించడం "ఇండియా" ఐక్య సంఘటనకు ఎక్కడ ఉపకరిస్తుందోనన్న భయం మోదీని పీడించకపోతే కర్పూరీ ఠాకూర్‌ను చరిత్ర గర్భంలోంచి వెలికితీసే వారే కాదు.

లాలూ ప్రసాద్ యాదవ్, నితీశ్ కుమార్, రాం విలాస్ పాశ్వాన్ లాంటి వారికి కర్పూరీ ఠాకూర్ రాజకీయ గురువు. కర్పూరీకి భారతరత్న ఇవ్వాలని నితీశ్ కుమార్ ఎప్పటి నుంచో కోరుతూనే ఉన్నారు. అయినా పట్టించుకోలేదు. కానీ కులగణన చేయించిన ఆయనకు రాజకీయంగా ఎక్కడ ప్రయోజనం దక్కుతుందోనని భయపడి హఠాత్తుగా కర్పూరీ ఠాకూర్ మెడలో భారతరత్న పతకం వేసేశారు.

ఏ సామాజిక వర్గం జనాభా ఎంతో వారికి ఆ దామాషా ప్రకారమే హక్కులు ఉండాలని రాహుల్ గాంధీ ప్రకటించడంతో మోదీ గుండెల్లో రైళ్లు పరుగెత్తాయి. రాహుల్‌ను బీజేపీ నాయకులు తూర్పార పట్టారు. కులగణన చేయడం అంటే "దేశాన్ని చంపినట్టే" అని కూడా కమలదళ నాయకులు ఆక్రోశించారు. త్వరలో 2024 సార్వత్రిక ఎన్నికలే లేకపోతే కర్పూరీ ఠాకూర్ విస్మృత జీవుల్లో అలాగే ఉండి పోయేవారే.

కర్పూరీ ఠాకూర్ రిజర్వేషన్లు అమలు చేసినప్పుడు బీజేపీ ఆయన ప్రభుత్వాన్ని పడగొట్టడమే కాకుండా వీధులకెక్కి ప్రతిభ మంటగలిసి పోతోందని గగ్గోలు పెట్టింది. కర్పూరీ ఠాకూర్ వెనుకబడిన కులాల వారికి రిజర్వేషన్లు కల్పించే సాహసమే చేయకపోతే మండల్ కమిషన్ ఊసే ఉండేదికాదు. మండల్ నివేదిక అమలు చేసినప్పుడు కూడా అగ్రవర్ణాల వారు ప్రతిభ మంటగలిసి పోతోందని నానా యాగీ చేశారు. ఆ సమయంలో అనేక మంది ఆత్మార్పణ కూడా చేసుకున్నారు.

కర్పూరీ ఠాకూర్ అణగారిన వర్గాలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించడంవల్లే మండల్ కమిషన్‌కు ప్రాశస్త్యం దక్కింది. కేంద్రంలో జనతా పార్టీ అధికారంలోకి వచ్చిన తరవాతే బీపీ మండల్ నాయకత్వంలో మండల్ కమిషన్ ఏర్పాటైంది. 1980లో మండల్ నివేదిక సమర్పించారు. కానీ 1990 ఆగస్టులో అప్పటి ప్రధాన మంత్రి విశ్వనాథ్ ప్రతాప్ సింగ్ ఆ నివేదిక దుమ్ము దులిపే దాకా ఇతర వెనుకబడిన వర్గాల వారికి రిజర్వేషన్ల అవసరాన్ని ఎవరూ గుర్తించనేలేదు. దాదాపు పదేళ్లుగా అధికారంలో ఉన్న మోదీకి కర్పూరీ ఠాకూర్ ఘనత తెలిసి రావడం సార్వత్రిక ఎన్నికలు ముంచుకొస్తున్నందువల్లే. ఓబీసీల పుట్టలోనూ ఓట్లు ఉంటాయిగా!

కర్పూరీ ఠాకూర్ తాత్వికంగా సోషలిస్టు. విద్యార్థి దశలో ఆయన అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్‌ఎఫ్) లో ఉండేవారు. తరవాత సోషలిస్టుగా మారారు. సోషలిస్టు భావాలున్న జై ప్రకాశ్ నారాయణ్‌కు సన్నిహితులు. ఆయన శతజయంతి సందర్భంలో కారణం ఏదైనా భారతరత్న దక్కడం సామాజికన్యాయం కోసం పోరాడే వారందరికి ఊరటే.

ఎవరికివెనుకబడిన తరగతుల వారికి ప్రత్యేక సదుపాయాలు అన్న మాట వినిపించగానే కాకా కాలేల్కర్ కమిషన్, ఆ తరవాత మండల్ కమిషన్ పేర్లు గుర్తుకు వస్తాయి. ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లది పెద్ద కథ. ఎస్సీ, ఎస్టీలు సామాజికంగా, విద్యా పరంగా వెనుకబడి ఉన్నారన్న ఆలోచనతో రాజ్యాంగ రచన సమయంలోనే వారికి రిజర్వేషన్లు కల్పించారు. కానీ సమాజంలో ఇతర వెనుకబడిన తరగతుల వారూ ఉన్నారు. వారి సంక్షేమానికీ సానుకూల చర్యలు తీసుకోవాలని డా. బీఆర్ అంబేద్కర్ సూచించారు. ఈ సలహా మేరకే కాకా కాలేల్కర్ కమిషన్ ఏర్పాటైంది. ఆయన నివేదిక కూడా సమర్పించారు. కానీ తాను ఈ నివేదికను నమ్మడంలేదని చెప్పడం మరో విచిత్రం. అప్పుడు నెహ్రూ ఈ నివేదికను అమలు చేయకుండా ఈ అంశాన్ని రాష్ట్రాల నిర్ణయానికి వదిలేశారు. ముంగేరీ లాల్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా కర్పూరీ ఠాకూర్ అణగారిన వర్గాలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించారు. మండల్ కమిషన్ సిఫార్సు చేసింది కూడా 27 శాతమే. అంటే కర్పూరీ ఠాకూర్ సరిగ్గానే అంచనా వేశారు. కర్పూరీ ఠాకూర్ 1988 దాకా సజీవంగానే ఉన్నా రాజకీయాలలో ఆయన పేరు అరుదుగానే వినిపించేది. సామాజిక న్యాయాన్ని ఆచరణలో పెట్టిన మొదటి నాయకుడు ఆయనే. ఆయన దృష్టిలో రిజర్వేషన్లు ఓట్లు కాసే చెట్లు కావు.

జోడో యాత్రకు నితీశ్ డుమ్మా?

న్యూఢిల్లీ: ప్రతిపక్ష ఇండియా కూటమికి వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. ఈ కూటమిలో ప్రధాన పార్టీగా ఉన్న కాంగ్రెస్‌కి మిత్ర పక్షాలు ఝలక్ ఇస్తున్నాయి. ఇప్పటికే కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ప్రకటించారు. ఎంపీ ఎన్నికల్లో తాము ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇక ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కాంగ్రెస్‌తో పొత్తు ఉండదని స్పష్టం చేసింది. వచ్చే ఎన్నికల్లో పంజాబ్, ఢిల్లీలో ఒంటరిగా పోటీ చేస్తున్నట్లు ప్రకటించింది. తాజాగా ఇండియా కూటమి తొలి సమావేశానికి నాయకత్వం వహించిన బీహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్ కూడా కాంగ్రెస్ పార్టీకి షాక్ ఇచ్చినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ ప్రారంభించిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో పాల్గొనకూడదని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 29న యాత్ర బీహార్‌లో ప్రవేశించనుంది. ఇందులో పాల్గొనాల్సిందిగా కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నాయకుడు షకీల్ అహ్మద్ ఖాన్ ద్వారా ఆహ్వానం అందిందని... అయితే లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి సీట్ల పంపకాల చర్చల్లో జాప్యం జరగడంతో ఇప్పటికే కలత చెందిన నితీశ్‌కుమార్ యాత్రలో పాల్గొనడంపై ఆసక్తిగా లేరని పార్టీ వర్గాలు తెలిపాయి. లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో సీట్ల పంపిణీపై కాంగ్రెస్ ఆలస్యం చేస్తుండటాన్ని జేడీయూ తప్పుబడుతోంది. దీనిపై ఆగ్రహంతో ఉంది.

రాహుల్ న్యాయ యాత్ర మార్గం మార్పు

కోల్‌కతా: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ కొనసాగిస్తున్న 'భారత్ జోడో న్యాయ యాత్ర' గురువారం అసోం నుంచి పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించింది. అయితే, యాత్ర మార్గానికి సంబంధించి చివరి నిమిషంలో కీలక మార్పు చోటుచేసుకుంది. ముందుగా ప్రతిపాదించినట్లు కాకుండా ఉత్తరాది జిల్లాల మీదుగా యాత్రను త్వరగా ముగించి బీహార్ లోకి వెళ్లేలా మార్గాన్ని మార్చారు. వారం రోజుల్లోగా 'న్యాయయాత్ర' మళ్లీ బెంగాల్‌లోకి ప్రవేశిస్తుందని రాష్ట్ర కాంగ్రెస్ శ్రేణులు అంచనా వేస్తున్నాయి. పార్టీకి మంచి పట్టున్న మాల్దా, ముర్షిదాబాద్ నియోజకవర్గాల్లో తరువాత యాత్ర కొనసాగుతుందని సమాచారం. సీపీఎంతో పాటు ఇండియా కూటమిలో భాగస్వాములుగా ఉన్న ఇతర పార్టీల నేతలు ఈ యాత్రలో పాల్గొన్నారు. కానీ, తృణమూల్ నాయకులు ఎక్కడా కనిపించలేదు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ ఒంటరిగానే పోటీ చేస్తుందని బుధవారం ఆ పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే న్యాయయాత్ర మార్గంలో మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

పొత్తులపై జాప్యం

- 'ఇండియా' కూటమికి సమాధి తవ్వుతున్న అధిర్ రంజన్
- కాంగ్రెస్ నాయకుడిని నిందించిన టీఎంసీ

న్యూఢిల్లీ : 'ఇండియా' కూటమికి సంబంధించి పొత్తుల విషయంలో 'ఇప్పటికే చాలా ఆలస్యమైంది' అని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. పొత్తు పని చేయకపోవడానికి కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరే కారణమని నిందించింది. పశ్చిమ బెంగాల్‌లో 'ఇండియా' కూటమి నుంచి కాకుండా సొంతంగా పోటీ చేస్తామని టీఎంసీ అధ్యక్షురాలు మమతా బెనర్జీ ప్రకటించిన ఒక రోజు తర్వాత ఈ తాజా ఆరోపణలు వచ్చాయి. టీఎంసీ అధికార ప్రతినిధి, రాజ్యసభలో ఆ పార్టీ పార్లమెంటరీ నాయకుడు డెరెక్ ఓబ్రెయిన్ మాట్లాడుతూ చౌదరి తరచూ కూటమికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని ఆరోపించారు. 'పశ్చిమ బెంగాల్‌లో కూటమి పని చేయకపోవడానికి ఆయనే కారణం' అని ఢిల్లీలో మీడియాతో అన్నారు. సాధారణ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ తన పనిని పూర్తి చేసి బీజేపీని గణనీయమైన సీట్లలో ఓడించినట్లయితే తృణమూల్ కాంగ్రెస్ రాజ్యాంగాన్ని విశ్వసించే, పోరాడే కూటమిలో చాలా భాగం అవుతుంది' అని డెరెక్ ఓబ్రెయిన్ పేర్కొన్నారు. బెంగాల్‌లో 'ఇండియా' కూటమికి అధిర్ రంజన్ చౌదరి 'సమాధి' తవ్వుతున్నారని తృణమూల్ వర్గాలు తెలిపాయి. 'ఆయన, ఆయన రోజువారీ ప్రేలాపనల కారణంగానే పరిస్థితులు దిగజారిపోయాయి. నిన్న ముఖ్యమంత్రి వ్యాఖ్యల తర్వాత వారు (కాంగ్రెస్) డ్యామేజ్ కంట్రోల్‌లో ఉన్నారు. సీట్ల పంపకం చర్చల సమయంలో తృణమూల్ 'చాలా ఓపికగా ఉంది. మేము తగినంత దయతో ఉన్నాము. కానీ ఇప్పుడు చాలా ఆలస్యమైంది' అని పేర్కొన్నాయి. బెంగాల్‌లో తృణమూల్ ఒంటరి పోరాటం చేస్తుందని, లోక్‌సభ ఎన్నికల తర్వాత మాత్రమే కాంగ్రెస్‌తో పొత్తుపై నిర్ణయం తీసుకుంటుందని మమతా బెనర్జీ బుధవారం ప్రకటించారు. సీట్ల పంపకంపై చర్చల ప్రతిష్టంభన తర్వాత కూటమిపై బెనర్జీ చేసిన వ్యాఖ్యలు వచ్చాయి. నివేదికల ప్రకారం, బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌కు రెండు సీట్లను ఆఫర్ చేస్తోంది. అయితే కనీసం 10 సీట్లు కావాలని కాంగ్రెస్ కోరుతోంది. లోక్‌సభలో కాంగ్రెస్ నాయకుడు కూడా అయిన చౌదరి తృణమూల్ అధ్యక్షురాలిని 'అవకాశవాద' నేతగా అభివర్ణించడం, కాంగ్రెస్ ఒంటరిగా ఎన్నికల్లో పోటీ చేయగలదని చెప్పడంతో విభేదాలు పతాక స్థాయికి చేరుకున్నాయి. 'ఇండియా' కూటమి సమావేశాల్లో టీఎంసీ, కాంగ్రెస్ నాయకత్వం ఐక్యంగా కనిపించినప్పటికీ, రాష్ట్ర స్థాయిలో బెనర్జీని లక్ష్యంగా చేసుకునే అవకాశాన్ని చౌదరి కోల్పోయారు. తృణమూల్ అధినేతపై ఆయన బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు ఇటీవల కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. 'మమతా బెనర్జీ నాకు, మా పార్టీకి చాలా సన్నిహితులు. కొన్నిసార్లు మా నాయకులు ఏదో మాట్లాడతారు. అయితే ఇవి విఘాతం కలిగించేవి కావు' అని రాహుల్ అన్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్ నష్ట నియంత్రణ పద్ధతిలో ఉంది. దెబ్బతిన్న బంధాలను చక్కదిద్దుకుంటామని హామీ ఇచ్చింది. ప్రతిష్టంభనకు పరిష్కారం కనుగొంటామని పార్టీ సీనియర్ నాయకుడు జైరాం రమేశ్ తెలిపారు. మమతాజీ లేని 'ఇండియా' కూటమిని కాంగ్రెస్ ఊహించుకోలేదని అన్నారు.

కేరళ గవర్నరు అహంకారం

అసెంబ్లీలో రెండు నిమిషాలే ప్రసంగం



తిరువనంతపురం: కేరళ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. సంప్రదాయబద్ధంగా మొదటిరోజు గవర్నరు ప్రసంగం ఉంటుంది. అయితే అధికార ఎల్‌డీఎఫ్‌తో వైరం పెంచుకున్న గవర్నరు ఆరిఫ్ మహ్మద్ ఖాన్ కేవలం 75 సెకన్లపాటు ప్రసంగం చదివి...కేవలం నాలుగు నిమిషాల్లోనే సభ నుంచి వెళ్లిపోయారు. గవర్నర్ తన ప్రసంగాన్ని కేవలం రెండు నిమిషాల్లోపే ముగించడం చర్చకు దారితీసింది. విధానపరమైన ప్రసంగంలో కేవలం చివరి పేరా మాత్రమే ఆయన చదివారు. ఈ ఉదయం 9 గంటలకు అసెంబ్లీకి చేరుకున్న గవర్నర్‌కు సీఎం పినరయి విజయన్, స్పీకర్ స్వాగతం పలికారు. అనంతరం సభలో ప్రసంగాన్ని మొదలుపెట్టిన గవర్నరు... నేరుగా చివరి పేరా చదివి ముగించారు. కొంతకాలంగా విజయన్ సర్కారుపై అసంతృప్తిగా ఉన్న ఆయన... ప్రభుత్వం ఇచ్చిన 62 పేజీల ప్రసంగం చదివేందుకు ఇష్టపడలేదు. కేవలం 75 సెకన్లు మాట్లాడారు. 9.02 గంటల్లోపు ప్రసంగం ముగించిన గవర్నరు... ఉదయం 9.04 గంటలకు సభ నుంచి వెళ్లిపోయారు. కనీసం సీఎంతో కరచాలనం కూడా చేయలేదు. కేరళలో సీఎం, గవర్నర్ మధ్య చాలాకాలంగా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. ప్రభుత్వం పంపించే బిల్లులను గవర్నర్ ఆమోదించకపోవడం, యూనివర్సిటీ నియామకాల్లో ప్రభుత్వ జోక్యం వంటి అంశాలతో ఇద్దరి మధ్యా భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తనపై భౌతికదాడి చేయించేందుకు కుట్ర పన్నుతున్నారని గవర్నర్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు.

1132 మందికి పోలీసు పతకాలు

ఏపీకి 9... తెలంగాణకు 20

న్యూఢిల్లీ: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ... పోలీసు, ఫైర్ సర్వీస్, హోంగార్డు, సివిల్ డిఫెన్స్ అధికారులకు వివిధ పోలీసు పతకాలు ప్రకటించింది. దేశవ్యాప్తంగా 1132 మందికి గ్యాలంట్రీ/సర్వీసు పతకాలు అందజేయనుండగా... అందులో ఏపీ నుంచి 9 మంది, తెలంగాణ నుంచి 20 మంది ఉన్నారు. గురువారం అవార్డుల జాబితా విడుదల చేసింది. ఇందులో 275 మందికి పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరికి ప్రెసిడెంట్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ, 102 మందికి రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 753 మందికి పోలీస్ విశిష్ట సేవా (మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్) పతకాలు ప్రకటించింది. గ్యాలంట్రీ పతకాలు దక్కించుకున్న 277 మందిలో అత్యధికంగా జమ్మూకశ్మీర్ నుంచి 72 మంది పోలీసులు, ఛత్తీస్‌గఢ్ నుంచి 26, ఝార్ఖండ్ నుంచి 23, మహారాష్ట్ర నుంచి 18 మంది ఉన్నారు. సీఆర్పీఎఫ్ నుంచి 65, సశస్త్ర సీమాబల్ నుంచి 21 మంది ఈ పతకాలు అందుకోనున్నారు.

మావోయిస్టు తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న 119 మంది, జమ్మూకశ్మీర్‌లో పనిచేస్తున్న 133 మందికి ఈ పతకాలు దక్కాయి. ఈ పురస్కారాల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి 9 మందికి, తెలంగాణ నుంచి 20 మందికి పతకాలు దక్కాయి. ఏపీలో 9 మందికి పోలీసు విశిష్ట సేవా పతకాలు ఇవ్వనున్నారు. తెలంగాణ నుంచి ఆరుగురు మెడల్ ఫర్ గ్యాలంట్రీ, ఇద్దరు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు, 12 మంది పోలీసు విశిష్ట సేవా పతకాలు అందుకోనున్నారు. తెలంగాణ అదనపు డీజీపీలు సౌమ్యా మిశ్రా, దేవేంద్ర సింగ్ చౌహాన్‌కు రాష్ట్రపతి విశిష్ట సేవా పతకాలు దక్కాయి. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని కేంద్ర హోంశాఖ ఏటా రెండుసార్లు పోలీసు పతకాలు ప్రకటిస్తుంది.

సుప్రీం న్యాయమూర్తిగా వరాలే ప్రమాణం

న్యూఢిల్లీ: కర్నాటక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి పీబీ వరాలే గురువారం సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డీవై చంద్రచూడ్ జస్టిస్ వరాలేతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీజేఐ సహా 34 మంది న్యాయమూర్తుల ఫుల్ బెంచ్ కొలువుతీరింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ సీటీ రవికుమార్‌ల తర్వాత జస్టిస్ వరాలే షెడ్యూల్డ్ కమ్యూనిటీకి చెందిన మూడవ సిట్టింగ్ జడ్జి కానున్నారు. సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు మేరకు జస్టిస్ ప్రసన్న బాలచంద్ర వరాలేను సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బుధవారం కేంద్రం ఆమోదించిన సంగతి తెలిసిందే. జస్టిస్ వరాలే పేరును ఈనెల ప్రారంభంలో కొలీజియం సిఫార్సు చేసింది. ఆయన అత్యంత సీనియర్ హైకోర్టు న్యాయమూర్తులలో ఒకరు. షెడ్యూల్డ్ కులానికి చెందిన ఏకైక హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అనే వాస్తవాన్ని పరిగణనలోకి తీసుకున్నట్లు సీజేఐ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల కొలీజియం తెలిపింది. గతేడాది డిసెంబర్ 25న జస్టిస్ ఎస్‌కే కౌల్ పదవీ విరమణ చేయడంతో సుప్రీంకోర్టులో ఖాళీ ఏర్పడింది. జస్టిస్ వరాలే పేరును ఎస్సీ కొలీజియం సిఫార్సు చేసిన వారం రోజుల్లోపే ఆయన నియామకం జరిగింది.

సీబీఐలో ఏడుగురు కొత్త డీఐజీల నియామకం

న్యూఢిల్లీ: సీబీఐలో కొత్తగా ఏడుగురు డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)లుగా నియమితులైనారు. వీరిలో సీనియర్ ఐపీఎస్ అధికారులు సుమేధ, గగన్‌దీప్ సింగ్లా ఉన్నారు. హిమాచల్ ప్రదేశ్ కేడర్‌కు చెందిన 2005 బ్యాచ్ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) అధికారి సుమేధను కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)లో ఐదేళ్ల పాటు డీఐజీగా నియమిస్తూ సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇక రాజస్థాన్ కేడర్‌కు చెందిన 2010-బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన సింగ్లాను ఐదేళ్లపాటు సీబీఐ డీఐజీగా నియమిస్తూ ఉత్తర్వు జారీ అయ్యాయి. జనవరి 12, 2024 నుంచి ఈ ఉత్తర్వు అమల్లోకి వస్తుంది. సింగ్లా గత ఏడాది నవంబర్‌లో సీబీఐలో సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్‌గా నియమించబడ్డారు. వీరిద్దరితో పాటు డీఐజీలుగా నియుక్తులైన ఐదుగురు ఐపీఎస్ అధికారులు - కే శివ సుబ్రమణి, ధురత్ సయాలీ సావ్లారామ్, పీ మురుగన్, రాజ్‌వీర్, జల్ సింగ్ మీనా - ఇప్పటికే సీబీఐ లో ఎస్పీలుగా పనిచేస్తున్నారు.

సొంత గూటికి మాజీ సీఎం శెట్టర్

బెంగళూరు: కర్నాటక మాజీ ముఖ్యమంత్రి జగదీశ్ శెట్టర్ తిరిగి బీజేపీలో చేరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ కండువా కప్పుకున్న శెట్టర్...తాజాగా సొంత గూటికి చేరారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో పాటు ఇతర నేతలతో భేటీ అయిన అనంతరం పార్టీలో చేరుతున్నట్లు శెట్టర్ ప్రకటించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాషాయ పార్టీ ఆయనకు టికెట్ ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌లో చేరారు. బీజేపీ కేంద్ర కార్యాలయంలో సీనియర్ నేతలు బీఎస్ యడియూరప్ప, ఆ పార్టీ కర్నాటక అధ్యక్షుడు బీవై విజయేంద్ర... శెట్టర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సభ్యత్వం అందజేశారు. బీజేపీలో తిరిగి చేరికపై శెట్టర్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ మరోసారి ప్రధాని అవుతారనే విశ్వాసం ఉందన్నారు. పార్టీలోకి రావాలని యడియూరప్ప, ఇతర సీనియర్ నేతలతో పాటు పార్టీ కార్యకర్తలు కోరడంతో సొంత గూటికి చేరానన్నారు. కర్నాటక అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేసిన శెట్టర్... కాంగ్రెస్‌లో చేరారు. హుబ్బళ్లి- ధార్వాడ సెంట్రల్ నుంచి హస్తం పార్టీ తరఫున పోటీ చేసి పరాజయం పాలయ్యారు. ఇక్కడ బీజేపీ నేత మహేశ్ 35 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

వేగంలోనూ 'కవచ్' పనితీరు అద్భుతం

న్యూఢిల్లీ: రైలు ప్రమాదాల నివారణకు అభివృద్ధి చేసిన కవచ్ వ్యవస్థ వేగంగా ప్రయాణించే సమయంలోనూ మెరుగైన ఫలితాలు ఇచ్చినట్లు ఉత్తర మధ్య రైల్వే తెలిపింది. గతవారం హరియాణాలోని పల్వాల్ నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మథుర స్టేషన్ల మధ్య నడిచే సెమీ-హైస్పీడ్ రైలులో ఈ వ్యవస్థను ఏర్పాటుచేసి పరీక్షించినట్లు ఆగ్రా రైల్వే డివిజన్ ప్రతినిధి ప్రశస్తి శ్రీవాస్తవ తెలిపారు. గంటకు 160 కి.మీ. వేగం వద్ద ఇది సమర్థంగా పనిచేసిందని ఒక ప్రకటనలో వెల్లడించారు. కవచ్ వ్యవస్థను పరీక్షించేందుకు రెడ్ సిగ్నల్ పడినప్పుడు బ్రేకులు వేయొద్దని లోకో పైలట్‌కు సూచించాం. 160 కి.మీ. వేగంతో వస్తున్నా సిగ్నల్ పడగానే 30 మీటర్ల ముందే కవచ్ ఆటోమేటిగ్గా బ్రేకులు వేసి రైలును ఆపింది. ఇందులో ఉపయోగించిన ప్యాసింజర్ కోచ్‌లు శతాబ్ది, గతిమాన్ ఎక్స్‌ప్రెస్‌లో వాడతారు. త్వరలో ప్రయాణికులతో కూడిన రైలులో ఈ వ్యవస్థను పరీక్షిస్తామని ప్రశస్తి తెలిపారు. ఢిల్లీ-ఆగ్రా మధ్య ఉన్న 125 కి.మీ. నెట్‌వర్క్‌ను అధికారులు మూడు భాగాలుగా విభజించారు. దేశవ్యాప్తంగా ఉన్న రైల్వే నెట్‌వర్క్‌లో గరిష్ఠ వేగం 130 కి.మీ.లు కాగా... ఢిల్లీ-ఆగ్రా మధ్య మాత్రం 160 కి.మీ. గతేడాది డిసెంబరులో కవచ్‌ను ఈ మార్గంలో 140 కి.మీ. వేగం వద్ద పరీక్షించారు. వందే భారత్ వంటి సెమీ-హైస్పీడ్ రైళ్ల నెట్‌వర్క్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న క్రమంలో ఇలాంటి వ్యవస్థలు ప్రమాదాల నియంత్రణలో కీలకమవుతాయని అధికారులు తెలిపారు.

వంతెనపై ఢీకొన్న వాహనాలు

నలుగురి దుర్మరణం

చెన్నై: తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ధర్మపురి జిల్లా తొప్పూర్ ఘాట్‌రోడ్ వద్ద ఓ వంతెనపై బహుళ వాహనాలు ఢీకొన్నాయి. మూడు ట్రక్కులు, రెండు కార్లు ఢీకొనడంతో నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం పొందారు. మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలవ్వగా... చికిత్స నిమిత్తం వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. ఒళ్లు గగుర్పొడిచే ఈ ఘటన బుధవారం సాయంత్రం చోటుచేసుకోగా... సీసీటీవీ కెమెరాలో దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఆ వీడియోను గమనిస్తే... వేగంగా దూసుకొస్తున్న ఈ ట్రక్కు ఎదురుగా వెళ్తున్న రెండు ట్రక్కులను ఢీకొంది. దీంతో ఒక ట్రక్కు అదుపు తప్పి వంతెనలో పడిపోయింది. ఈ మూడు ట్రక్కుల మధ్య వెళ్తున్న ఒక కారు నుజ్జునుజ్జు అయ్యింది. ఇంతలోనే ఓ ట్రక్కుకు మంటలు అంటుకున్నాయి. మరోవైపు... ఈ ప్రమాదంలో అనుసరిస్తున్న మరో కారు కూడా ధ్వంసమైంది. ఫలితంగా ఇద్దరు మహిళలతో కలిపి మొత్తం నలుగురు మృతి చెందారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్... మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయాలైన వారికి రూ.50 వేల సహాయం అందజేశారు. ఈ ఘటనపై ధర్మపురి డీఎంకే ఎంపీ సెంథిల్ కుమార్ స్పందిస్తూ పెండింగ్‌లో ఉన్న ఎలివేటెడ్ నేషనల్ హైవే పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటాయన్న భయంతోనే తాము తొప్పూర్ ఘాట్ సెక్షన్ వద్ద మంజూరైన ఎలివేటెడ్ హైవేని సత్వరమే అమలు చేయాలని పట్టుబడుతున్నామని ఆయన అన్నారు.

మాకు రాహుల్ గాంధీ కావాలి

అసోం సీఎం వ్యంగ్య ట్వీట్



గువహతి: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్న అసోం సీఎం హిమంత విశ్వశర్మ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తమకు రాహుల్ గాంధీ కావాలంటూ ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో రాహుల్ గాంధీ ఉంటే, తమకు విజయం మరింత సులభతరం అవుతుందన్న కోణంలో హిమంత ఎక్స్ వేదికగా 'మాకు రాహుల్ గాంధీ కావాలి' అని చెప్పుకొచ్చారు. భారత్ జోడో న్యాయ యాత్ర చేపట్టిన రాహుల్‌గాంధీకి ప్రధాన మార్గాల నుండి గువహతిలో ప్రవేశించడానికి అనుమతి ఇవ్వలేదు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు, అసోం పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై సీఎం హిమంత మాట్లాడుతూ ఆ ఘర్షణపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా విచారణ జరుపుతుందని అన్నారు. చట్టాన్ని ఉల్లంఘించినందుకుగాను రాహుల్ గాంధీని లోక్‌సభ ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని చెప్పారు. హిమంత చేసిన ఈ 'అరెస్ట్' వ్యాఖ్యలపై కర్నాటక కేబినెట్ మంత్రి ప్రియాంక్ ఖర్గే ఎక్స్ వేదికగా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "లోక్‌సభ ఎన్నికల వరకు ఎందుకు వేచి ఉండాలి? రాహుల్ గాంధీ నిజంగానే చట్టాన్ని ఉల్లంఘిస్తే, ఇప్పుడే ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. రాహుల్ చేస్తున్న పని చూసి మీకు భయం చుట్టుకుందని తన ట్వీట్‌లో రాసుకొచ్చారు. ఈ ట్వీట్‌కి హిమంత బదులిస్తూ లోక్‌సభ ఎన్నికల సమయంలో మాకు రాహుల్ గాంధీ కావాలి బ్రదర్ అంటూ ఎగతాళి చేశారు. అందుకే ఎన్నికల తర్వాత అరెస్ట్ చేస్తామని చెప్పానన్నారు.

యువత కలలు నెరవేరుస్తా: మోదీ

న్యూఢిల్లీ: దేశ భవిష్యత్తును నిర్ణయించేది యువ ఓటర్లేనని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. పదేళ్లలో తమ ప్రభుత్వం దేశాన్ని అంధకారం నుంచి బయటకు తీసుకొచ్చిందని గొప్పలు చెప్పారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బీజేపీ యువమోర్చా అధ్వర్యంలో యువ ఓటర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాని వర్చువల్‌గా ప్రసంగించారు. రాబోయే 25 ఏళ్లలో దేశాన్ని అభివృద్ధి చేసే బాధ్యత యువతపై ఉందన్నారు. కుటుంబ పాలన, బంధుప్రీతి ప్రాధాన్యంగా గల కొన్ని పార్టీలు రాజకీయాల్లో యువత ఎదుగుదలను అడ్డుకున్నాయని, ఓటు హక్కుతో మీరంతా కుటుంబ పార్టీలను ఓడించాలని యువతకు పిలుపునిచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అవకాశాల గురించి యువత చర్చించుకుంటోందని, పదేళ్లకు ముందు వారి భవిష్యత్తును అప్పటి ప్రభుత్వాలు అంధకారంలోకి నెట్టేశాయని ఆరోపించారు. డిజిటల్ ఇండియా, స్టార్టప్ నినాదంతో తాము అవకాశాలు కల్పించామని, మీ కలలను నెరవేర్చటమే తన లక్ష్యమని, ఇందుకు మోదీ గ్యారెంటీ అని ప్రధాని వెల్లడించారు. కేంద్రంలో పదేళ్లుగా స్థిరమైన ప్రభుత్వం అధికారంలో ఉండటం వల్లే ఆర్టికల్ 370, జీఎస్టీ అమలు, మహిళా బిల్లు, ట్రిపుల్ తలాక్ వంటి ఎన్నో సమస్యలకు పరిష్కారం లభించిందని తెలిపారు.

'ఇండియా' కూటమికి మమత అవసరం

- టీఎంసీతో సీట్ల పంపకంపై సమష్టిగా పరిష్కారం
- కాంగ్రెస్ నేత జైరాం రమేశ్



సిలిగురి (పశ్చిమ బెంగాల్) : తృణమూల్ కాంగ్రెస్ పార్టీతో సీట్ల పంపకం ప్రతిష్టంభనకు పరిష్కారం లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జైరాం రమేష్ గురువారం ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ బాగ్డోగ్రా విమానాశ్రయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెనర్జీ లేని 'ఇండియా' కూటమి గురించి కాంగ్రెస్ ఆలోచించదని, దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటంలో ఆమె అనివార్యమని అన్నారు. మనం బెంగాల్, దేశంలో బీజేపీని ఓడించాలనుకుంటే మమతా బెనర్జీ చాలా అవసరం. మా నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గేకు మమతా జీ అంటే ఎనలేని గౌరవం' అని అన్నారు. 'ఇండియా' కూటమి మూల స్తంభాలలో' ఒకటిగా సీఎం మమతా బెనర్జీ ప్రాముఖ్యతను ఎత్తి చూపిన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి 'మమతా బెనర్జీ, టీఎంసీ లేని కూటమిని ఎవరూ ఊహించలేరు' అని అన్నారు. బెంగాల్‌లో ఒంటరిగా పోటీ చేయాలనే టీఎంసీ అధినేత్రి నిర్ణయం గురించి జైరాం రమేశ్ మాట్లాడుతూ సీట్ల పంపకాల ప్రతిష్టంభనపై పరిష్కారాన్ని కనుగొనేందుకు కాంగ్రెస్ ఆసక్తిగా ఉందన్నారు. 'సీట్ల పంపకంపై ఎటువంటి రన్నింగ్ కామెంట్రీ చేయకూడదనుకుంటున్నాను. కానీ ఈ ప్రతిష్టంభన ముగియాలని మేము కోరుకుంటున్నాము. మేము ఒక పరిష్కారాన్ని కనుగొంటాము' అని తెలిపారు. గురువారం ఉదయం బెంగాల్‌లోకి ప్రవేశించిన 'భారత్ జోడో న్యాయ యాత్ర'లో పాల్గొనాల్సిందిగా బెనర్జీని పార్టీ ఆహ్వానించిందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెప్పారు. 'యాత్రలో చేరాలని మమతా జీకి మేము రెండుసార్లు ఆహ్వానాలు పంపాము. మా లక్ష్యం అదే అయినందున ఆమె యాత్రలో భాగం కావాలని మనమందరం కోరుకుంటున్నాము. దేశంలో జరుగుతున్న అన్యాయంపై పోరాడాలి' అని అన్నారు.

ఎగుమతులు పెంచడానికి బడ్జెట్‌లో మరిన్ని నిధులు అవసరం

న్యూఢిల్లీ: ఉత్పత్తి, ఇతర దేశాలకు ఎగుమతులను పెంచడానికి మార్కెటింగ్ కార్యకలాపాలకు బడ్జెట్‌లో మరిన్ని నిధులు, పరిశోధనకు పన్ను రాయితీలు కల్పించాలని ఎగుమతిదారులతో సహా భారతీయ పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరింది. అలాగే ప్రైవేటు రంగ భాగస్వామ్యంతో అంతర్జాతీయ షిప్పింగ్ లైన్‌ను అభివృద్ధి చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పెరుగుతున్న ఎగుమతులతో రవాణా సేవలపై భారతదేశ బాహ్య చెల్లింపులు పెరుగుతున్నాయి.

"మనం 2021లో రవాణా సేవా ఛార్జీగా 80 బిలియన్ల డాలర్లకు పైగా చెల్లించాము. దేశం1 ట్రిలియన్ డాలర్ల లక్ష్యం దిశగా వెళుతున్నందున, ఇది 2030 నాటికి 200 బిలియన్ల డాలర్లకు చేరుకుంటుంది' అని భారతీయ ఎగుమతి సంస్థల సమాఖ్య (ఎఫ్ఐఈఓ) తెలిపింది. షిప్పింగ్ లైన్లను అభివృద్ధి చేయడంలో ప్రైవేటు రంగం నిమగ్నమైతే... విదేశీ షిప్పింగ్ లైన్‌లు, ముఖ్యంగా మన ఎంఎస్ఎంఈల ద్వారా చేయి తిప్పడాన్ని కూడా తగ్గిస్తుందని సంస్థ తెలిపింది. ఉత్పత్తి రంగంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)ని ప్రోత్సహించడానికి, వెయిటెడ్ పన్ను మినహాయింపును 200 శాతానికి పెంచవచ్చని సూచించింది. 'దురదృష్టవశాత్తూ, చైనా (జీడీపీలో 2.43 శాతం), అమెరికా (3.46 శాతం), కొరియా (4.93 శాతం), ఇజ్రాయిల్ (5.56 శాతం) వంటి ప్రధాన దేశాలు చేస్తున్న వ్యయం కన్నా భారత దేశం ఆర్&డిపై చేస్తున్న వ్యయం (జీడీపీలో 1శాతం కంటే తక్కువ) చాలా తక్కువగా ఉంది' అని ఎఫ్ఐఈఓ ఉపాధ్యక్షుడు ఇస్రార్ అహ్మద్ పేర్కొన్నారు.

ప్రపంచ వినియోగదారులకు భారతీయ ఉత్పత్తులు, సేవలను అందించడానికి వేగవంతమైన ఎగుమతి మార్కెటింగ్ అవసరమని, అందుకోసం మార్కెట్ యాక్సెస్ ఇనిషియేటివ్ (ఎంఏఐ) పథకం కింద మరిన్ని నిధులు అవసరమని ఆయన అన్నారు. వేగవంత మార్కెటింగ్ పథకం కోసం కార్పస్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అహ్మద్ చెబుతూ... 5వేల కోట్ల కార్పస్‌తో 50 జిల్లాల్లో పైలట్ ప్రాతిపదికన ఒక పథకాన్ని ప్రకటించడాన్ని ప్రభుత్వం పరిశీలించవచ్చని సూచించారు. ఇక తయారీ ప్రక్రియల్లో గ్రీన్ ఇంధనాన్ని ఉపయోగించడం కోసం ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను, గ్రీన్ టెక్నాలజీలలో పెట్టుబడి కోసం సబ్సిడీ రుణాలు అందించడాన్ని పరిగణనలోకి తీసుకోవాలని స్టార్టప్ సంస్థ వరల్డ్ ఆఫ్ సర్క్యులర్ ఎకానమీ (డబ్ల్యూఓసీఈ) వ్యవస్థాపకుడు అనూప్ గార్గ్ ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా ఎంఎస్ఎంఈలు తక్షణ ఆర్థిక భారాలు, అవసరమైన వనరులను పొందడం వంటి అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఈ సవాళ్లను అధిగమించడానికి స్థిరమైన పద్ధతులతో అతుకులు లేని ఏకీకరణను సులభతరం చేయడానికి ప్రభుత్వ తక్షణ జోక్యం అవసరమని చెప్పారు.

వారసత్వ వ్యాఖ్యల దుమారం

నితీశ్‌పై లాలు కుమార్తె మండిపాటు

పాట్నా: బీహార్‌లో ఆర్జేడీ-జేడీయూ శిబిరంలో మనస్పర్థలు ఒక్కొకటీ బయటపడుతున్నాయి. తాజాగా ఆ రాష్ట్ర మాజీ సీఎం లాలూ ప్రసాద్ యాదవ్ కుమార్తె రోహిణి ఆచార్య చేసిన ట్వీట్లు కలకలం రేపుతున్నాయి. స్వాతంత్ర్య సమర యోధుడు, మాజీ సీఎం కర్పూరి ఠాకూర్‌కు కేంద్రం భారతరత్న ప్రకటించడాన్ని సీఎం నితీశ్ కుమార్ ప్రశంసించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ రాజవంశ రాజకీయాలపై విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలపై రోహిణి తీవ్రంగా స్పందించారు. ఆమె ఎక్స్‌లో నితీశ్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. 'నితీశ్ గాలిలాగా ఎప్పటికప్పుడు తన భావజాలాన్ని మార్చే సోషలిస్ట్' అని వ్యంగ్యంగా స్పందించారు. దీంతో రెండు పార్టీల మధ్య మాటల యుద్ధం జరుగుతోంది. అత్యంత వెనకబడిన వర్గాల కోసం జీవితాంతం కృషి చేసిన కర్పూరీ ఠాకూర్‌కు భారతరత్న ఇవ్వాలని తమ పార్టీ ఎంతోకాలంగా కేంద్రప్రభుత్వాలకు విజ్ఞప్తి చేసిందని, గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలను కూడా డిమాండ్ చేశామని నితీశ్ బుధవారం చెప్పారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వానికి చాలాసార్లు విజ్ఞప్తి చేస్తే, ఇప్పటికి పురస్కారం ఇచ్చారని తెలిపారు. కర్పూరీ ఠాకూర్ శతజయంతి నేపథ్యంలో జేడీయూ నిర్వహించిన

సమావేశంలో నితీశ్ ప్రసంగించారు. కర్పూరీ ఠాకూర్ పదవిని అడ్డం పెట్టుకొని కుటుంబానికి ఏనాడూ లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేయలేదని.. దాని నుంచి తాను స్ఫూర్తి పొందానని, తన కుటుంబంలో ఎవరినీ ముందుకు తీసుకురాలేదని, ఈ విషయం అందరికీ తెలుసునని నితీశ్ పేర్కొన్నారు. ఆర్జేడీని ఉద్దేశించే నితీశ్ కుటుంబ రాజకీయాల గురించి ఈ వ్యాఖ్య చేశారని ఊహాగానాలు వెలువడ్డాయి. నితీశ్ చేసిన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ చర్చలు మొదలయ్యాయి.

నితీశ్ ఆర్జేడీని లక్ష్యం చేయలేదు: త్యాగి

జేడీ(యూ) జాతీయ అధ్యక్షుడు, బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ 'రాజవంశ రాజకీయాలకు' వ్యతిరేకంగా మాట్లాడటం ద్వారా మిత్రపక్షమైన ఆర్జేడీని లక్ష్యంగా చేసుకున్నారనే ఆరోపణలను జేడీ(యూ) సీనియర్ నాయకుడు కె.సి.త్యాగి తిరస్కరించారు. జేడీ(యూ) రాజకీయ సలహాదారు, అధికార ప్రతినిధి త్యాగి బుధవారం ఇక్కడ జరిగిన పార్టీ ర్యాలీలో కుమార్ ప్రసంగాన్ని అనుసరించిన సూచన గురించి ప్రశ్నలకు సమాధానమిచ్చారు. 'తాను ఆరాధించిన కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నితీశ్ కుమార్ ప్రసంగించారు. గొప్ప సామ్యవాదులందరిలాగే, ఠాకూర్ కూడా రాజకీయాల్లో రాజవంశ వారసత్వాన్ని అసహ్యించుకున్నాడు. ఇది నితీశ్ కుమార్ నొక్కి చెప్పాలనుకున్న సాధారణ వాస్తవం. అందులో ఇంకేమీ చదవకూడదు' అని త్యాగి నొక్కి చెప్పారు. ముఖ్యంగా ఆర్జేడీకి నితీశ్ కుమార్ మాజీ ప్రత్యర్థి లాలూ ప్రసాద్ నాయకత్వం వహిసున్నారు. అతని చిన్న కుమారుడు, వారసుడు తేజస్వి యాదవ్ రెండు సంవత్సరాల కిందటే జేడీ(యూ) బీజేపీని వీడి... 'మహాఘట్బంధన్'తో చేతులు కలిపినప్పుడు తేజస్వి ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఈ కూటమిలో కాంగ్రెస్, మూడు వామపక్ష పార్టీలు ఉన్నాయి. ఇదిలాఉండగా, లాలూ ప్రసాద్ ప్రసాద్ పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్ కూడా రాష్ట్ర మంత్రివర్గంలో మంత్రిగా ఉండగా, ఆయన పెద్ద కుమార్తె మిసా భారతి రాజ్యసభ సభ్యురాలు. అయితే, ఏ ప్రాంతీయ పార్టీని లేదా నాయకుడిని ఖండించాలనే కోరిక నితీశ్ కుమార్‌కు లేదని త్యాగి అన్నారు. 'దేశానికి రాజవంశం అవసరమని భావించేవారు, వారి స్వంత తీర్మానాలను తీసుకోవచ్చు' అని అన్నారు.

నారాయణ, చైతన్య కళాశాలల ఫీజు వేధింపులు

ఏఐఎస్ఎఫ్ నాయకులు జాన్సన్ బాబు, రమణయ్య

విశాలాంధ్ర-జేఎన్‌టీయూఏ: రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యార్థులు ఫీజులు చెల్లిస్తేనే కళాశాలలోకి అనుమతిస్తామంటూ వారిని వేధింపులకు గురి చేస్తున్నారని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు, జిల్లా అధ్యక్షుడు రమణయ్య, కార్యదర్శి కుల్లాయి స్వామి విమర్శించారు. గురువారం నీలం సంజీవరెడ్డి భవనంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల వేధింపులపై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సెలవుల అనంతరం విద్యార్థులు కళాశాలలకు వస్తున్న తరుణంలో పూర్తి ఫీజు చెల్లిస్తేనే విద్యాసంస్థలోకి అనుమతి... లేకుంటే బయటే ఉండాలని మార్గదర్శకాలు జారీ చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు వేధింపులకు గురవుతున్న విషయం, కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీ పర్వం అధికారులకు సాక్షాలతో సహా కనిపిస్తోన్నప్పటికీ యాజమాన్యాలపై చర్యలు చేపట్టడంలో విద్యా శాఖ అధికారులు మొద్దు నిద్ర ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. కార్పొరేట్ యాజమాన్యాలకు సహకరిస్తూ ఉండటం... ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి, విద్యాశాఖ పనితీరు తేటతెల్లం అవుతోందన్నారు. విద్యా శాఖ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టవలసి వస్తుందని హెచ్చరించారు.

చిన్నారులను బలిగొన్న పానీపూరి

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: పానీ పూరి తిని అస్వస్థతకు లోనై ఒకే కుటుంబంలో ఇద్దరు బాలురు మృతి చెందిన ఘటన ఏలూరు జిల్లా జంగారెడ్డి గూడెం లో చోటుచేసుకుంది.నంద్యాల జిల్లా వైఎస్ఆర్ కాలనీకి చెందిన రవి జీవనోపాధి కోసం ప్లాస్టిక్ వ్యాపారం చేసుకుని జీవించేందుకు జంగారెడ్డిగూడెం వలస వచ్చాడు. బుధవారం అర్ధరాత్రి తన ఇద్దరు పిల్లలు రామకృష్ణ (10), విజయ్ (6) తీవ్రమైన వాంతులతో అస్వస్థతకు గురయ్యారు. వెంటనే రామకృష్ణ ను రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విజయ్‌కి జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు తరలిస్తుండగా విజయ్ కూడా మార్గమధ్యలోనే మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం శోకసముద్రంలో మునిగిపోయింది. రాత్రి రామకృష్ణ, విజయ్ లు పట్టణంలోని పానీపూరి బండి వద్ద పానీ పూరి తిన్నారని, దానివల్లే ఫుడ్ పాయిజన్ జరిగి తన ఇద్దరు బిడ్డలు మరణించి ఉంటారని చిన్నారుల తండ్రి రవి ఆరోపిస్తున్నాడు. కాగా ఆసుపత్రిలో బాలుర మృతదేహాలను డీఎస్పీ ధనుంజయుడు పరిశీలించారు. సీఐ రాజేష్ అధ్వర్యంలో ట్రైనీ డీఎస్పీ విద్య, ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. బాలుర మృతదేహాలకు వైద్యులు పోస్ట్ మార్టమ్ నిర్వహించారు.

త్వరలో బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతి

డీఆర్‌డీఓ అధినేత సమీర్ కామత్

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ క్షిపణుల ఎగుమతికి భారత్ సిద్ధమైంది. మార్చికి సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిసైళ్లను రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) ఎగుమతి చేయబోతోంది. ఈ మేరకు డీఆర్‌డీఓ అధినేత సమీర్ వీ కామత్ గురువారం వెల్లడించారు. పది రోజుల్లో క్షిపణుల గ్రౌండ్ సిస్టమ్‌ల ఎగుమతి ప్రారంభమవుతుందని, డీఆర్‌డీఓ అభివృద్ధి చేసిన భారత్ ఫోర్జ్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌తో పాటు ప్రైవేట్ సంస్థలు తయారు చేస్తున్న ఏటీఏజీఎస్ 307 గన్స్‌కు విదేశాల నుంచి ఆర్డర్లు రావచ్చన్నారు. ఫిలిప్పీన్స్‌తో పాటు అనేక దేశాలు బ్రహ్మోస్ క్షిపణిపై ఆసక్తి చూపుతున్నాయని కామత్ తెలిపారు. ఎగుమతికి సిద్ధంగా ఉన్న ఏటీఏజీఎస్ గన్స్ పరీక్షలు పూర్తయ్యాయని, మార్చి 31 వరకు ఆర్డర్ రావచ్చన్నారు. డీఆర్‌డీఓ ఉత్పత్తి చేసే ఆయుధాలు త్రివిధ దళాల్లో చేరనున్నాయని తెలిపారు. ఎల్‌సీఏ ఎంకే-1ఏ, అర్జున్ ఎంకే-1ఏ, క్విక్ రియాక్షన్ సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ తదితర క్షిపణులు త్వరలోనే సైన్యంలో భాగమవుతాయన్నారు.

ఎన్నికల నిర్వహణకు 982 కొత్త పోస్టులు

- 105 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతో పటిష్ఠ నిఘా
- సీఎస్ జవహర్‌రెడ్డి వెల్లడి
- ఏర్పాట్లపై కలెక్టర్లతో సమీక్ష

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల పటిష్ఠ నిర్వహణకు జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయం (కలెక్టరేట్లు), అసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారుల కార్యాలయాలకు 982 పోస్టులను మంజూరు చేస్తున్నామని, ఆ పోస్టులను త్వరగా భర్తీ చేసుకోవాలని జిల్లా కలెక్టర్లను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డా.కేఎస్.జవహర్ రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనాతో కలిసి ఎన్నికల సన్నద్ధతపై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ఎన్నికల విధులతో సంబంధం ఉండి మూడేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వివిధ శాఖల అధికారుల బదిలీ ప్రక్రియ దాదాపు పూర్తయిందని తెలిపారు. పోలీస్, రెవెన్యూ శాఖల్లో కొంత మేరకు బదిలీలు జరగ్గా, మిగతా బదిలీలు ఒకటి రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖలో బదిలీలు కూడా రెండు రోజుల్లోగా పూర్తి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో పటిష్ఠ నిఘాకై రాష్ట్ర వ్యాప్తంగా 105 అంతరాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేయగా, వాటిలో 20 ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులు ఉన్నాయి. వీటిలో పోలీసు శాఖ ద్వారా 62, స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ద్వారా 9, అటవీశాఖ ద్వారా 14 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గత నెల రోజుల్లో అంతరాష్ట్ర చెక్ పోస్టుల ద్వారా 2కోట్ల 35 లక్షల రూపాయల నగదు, 51వేల 143 లీటర్ల మద్యం,1323 కిలోల వివిధ మాదక ద్రవ్యాలు, ఇతర విలువైన లోహాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఈచెక్ పోస్టులన్నీ రానున్న రోజుల్లో మరింత సమర్థంగా పనిచేసి అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు సంబంధించి ముఖ్యంగా తాగునీరు, ఫర్నిచర్, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లు, దివ్యాంగులకు ర్యాంపులు వంటి సౌకర్యాలను త్వరిత గతిన ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్‌కుమార్ మీనా మాట్లాడుతూ రానున్న ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన ఇతర అంశాలపై కలెక్టర్లకు సూచనలు చేశారు. ఈసమావేశంలో అదనపు సీఈవో కోటేశ్వరరావు, పీఆర్ అండ్ ఆర్డీ కమిషనర్ సూర్యకుమారి,వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ జే నివాస్ తదితరులు పాల్గొన్నారు.

అన్యాయంపై 'ఇండియా' ఐక్యపోరు

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ

కూచ్‌బెహార్ (కోల్‌కతా): దేశవ్యాప్తంగా అన్యాయాన్ని ఎదుర్కోవడంలో ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఐక్యతపై కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ విశ్వాసం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్‌లో లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేయాలని టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ నిర్ణయం తీసుకున్న ఒక రోజు తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. గాంధీ నేతృత్వంలోని భారత్ జోడో న్యాయ యాత్ర గురువారం అసోం నుంచి పశ్చిమ బెంగాల్‌లోకి ప్రవేశించింది. రాహుల్‌కు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అధిర్ రంజన్ చౌదరి ఘనస్వాగతం పలికారు. కూచ్‌బెహార్‌లో విలేకరులతో మాట్లాడిన రాహుల్‌గాంధీ.... 'పశ్చిమ బెంగాల్‌కు వచ్చినందుకు సంతోషంగా ఉంది. మీ మాట వినడానికి, మీతో నిలబడటానికి మేము ఇక్కడకు వచ్చాం. బీజేపీ-ఆర్ఎస్ఎస్ విద్వేషాన్ని, హింసను, అన్యాయాన్ని వ్యాప్తి చేస్తున్నాయి. అందువల్ల 'ఇండియా' కూటమి అన్యాయంపై కలిసి పోరాడబోతోంది' అని చెప్పారు. దేశవ్యాప్తంగా అన్యాయం జరుగుతున్నందున యాత్రకు న్యాయ్ (న్యాయం) అనే పదం జత చేశామని అన్నారు. కాగా, కాంగ్రెస్ మిత్రపక్షాలయిన రాష్ట్రంలోని వామపక్ష పార్టీలు 'ఇండియా' కూటమి యాత్రలో చేరాలని భావిస్తున్నాయి. యాత్రకు సంబంధించిన సమాచారం లేదనే కారణంతో టీఎంసీ దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. బెంగాల్‌లో భారత్ జోడో న్యాయ యాత్ర డార్జిలింగ్, రాయ్‌గంజ్, ఉత్తర, దక్షిణ మాల్దాలో ఆరు జిల్లాలు, ఆరు లోక్‌సభ నియోజకవర్గాలు... ముర్షిదాబాద్‌లోని రెండుచోట్ల ఐదు రోజుల పాటు 523 కి.మీ. మేర కొనసాగనుంది. ఏప్రిల్-మే 2021 అసెంబ్లీ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీ రాష్ట్రానికి రావడం ఇదే తొలిసారి. జనవరి 14న మణిపూర్‌లో ప్రారంభమైన ఈ యాత్ర 67 రోజుల్లో 6,713 కిలోమీటర్ల మేర 15 రాష్ట్రాల్లోని 110 జిల్లాల గుండా ప్రయాణించి మార్చి 20న ముంబైలో ముగుస్తుంది.

సీఐడీకి రాహుల్ గాంధీ కేసు

గువహతి: కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ అసోంలో నిర్వహించిన భారత్ జోడో న్యాయ యాత్రలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం, రాహుల్ సహా ఇతర నేతలపై కేసు నమోదు చేసిన రాష్ట్ర పోలీసులు తాజాగా ఈ కేసును సీఐడీకి బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు కోసం కేసును సీఐడీకి అప్పగిస్తున్నట్లు రాష్ట్ర డీజీ వెల్లడించారు. రాహుల్ యాత్ర గువహతిలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. ట్రాఫిక్ కారణాల దృష్ట్యా నగరంలో యాత్ర చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి నిరాకరించింది. అందుకు బదులుగా బైపాస్ నుంచి వెళ్లాలని సూచించింది. ఈ క్రమంలోనే యాత్ర నగరంలోకి ప్రవేశించకుండా పోలీసులు బారికేడ్లు అడ్డుపెట్టారు. అయితే, కాంగ్రెస్ కార్యకర్తలు వాటిని తోసుకుని ముందుకు దూసుకెళ్లారు. దీంతో పోలీసులు, పార్టీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. సమూహాన్ని రాహుల్ రెచ్చగొట్టారని ఆరోపిస్తూ ఆయనపై కేసు నమోదు చేయాలని ముఖ్యమంత్రి హిమంత విశ్వశర్మ ఆదేశించారు. యాత్ర పేరుతో అసోంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడమే కాంగ్రెస్ ఉద్దేశమని, లోక్‌సభ ఎన్నికల తర్వాత రాహుల్‌గాంధీని అరెస్టు చేస్తామని సీఎం పేర్కొన్నారు.

దిల్లీ వెళ్లిన రాహుల్

బెంగాల్‌లో యాత్రకు రెండు రోజుల విరామం
తాజా రాజకీయ పరిణామాలే కారణమా?

కూచ్ బెహార్: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ గురువారం మధ్యాహ్నం అత్యవసరంగా దిల్లీకి బయలుదేరి వెళ్లారు. 'భారత్ జోడో న్యాయ యాత్ర'కు రెండు రోజు తాత్కాలిక విరామం ప్రకటించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం అసోం నుంచి పశ్చిమ బెంగాల్‌లోని కూచ్ బెహార్ జిల్లాలోకి యాత్ర ప్రవేశించింది. ఇక్కడ రోడ్ షో నిర్వహించిన అనంతరం ప్రత్యేక విమానంలో ఆయన దిల్లీకి వెళ్లారు. అలీపూర్‌దూర్‌లోని ఫలకాటాకు యాత్ర నిలిచిపోయింది. 'గాంధీ ప్రత్యేక విమానంలో అలీపుర్‌దువార్‌లోని హసిమారా ఎయిర్ బేస్ నుంచి న్యూదిల్లీకి బయలుదేరారు. ఆయనకు కొన్ని అత్యవసర పని ఉంది' అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు శుభాంకర్ సర్కార్ చెప్పారు. 'విరామం తర్వాత జనవరి 28న యాత్ర తిరిగి ప్రారంభమవుతుంది. అప్పటికి గాంధీ తిరిగి వచ్చి చేరతారు' అని ఆయన చెప్పారు. విరామం తర్వాత, యాత్ర జనవరి 29న బీహార్‌లోకి ప్రవేశించే ముందు పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్‌గురి, అలీపుర్‌దువార్, ఉత్తర దినాజ్‌పూర్, డార్జిలింగ్ జిల్లాల మీదుగా కొనసాగుతోంది. 'ఇండియా' కూటమి ఏర్పాటులో కీలకంగా వ్యవహరించిన నితీశ్ కుమార్ తిరిగి బీజేపీ వైపు చూస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో బీజేపీ, జేడీయూ నాయకులు ఒకే విమానంలో పాట్నా నుంచి దిల్లీకి వెళ్లినట్లు సమాచారం. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నితీశ్‌ను శాంతింపజేసేందుకు ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ ఆయనను ఫోన్‌లో సంప్రదించినట్లు తెలుస్తోంది. మరోవైపు లాలూ కూడా పార్టీ ముఖ్య నేతలతో అత్యవసరంగా సమావేశమైనట్లు వార్తలు వెలువడుతున్నాయి. దీంతో కూటమిని నితీశ్ వీడితే మిగిలిన పార్టీలతో కలిసి అనుసరించాల్సిన కార్యాచరణపై పార్టీ ముఖ్య నేతలతో చర్చించేందుకు రాహుల్ దిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది.

ఇది పరివర్తన కాలం

రిపబ్లిక్ డే ప్రసంగంలో రాష్ట్రపతి ముర్ము

న్యూఢిల్లీ: మహిళల సాధికారతకు విప్లవాత్మక అస్త్రంగా 'నారీశక్తి వందన్ అధినియం' పరిణమిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆకాంక్షించారు. మన పరిపాలనలో మెరుగదలకూ ఇది దోహదమవుతుందని తెలిపారు. మనం అమృత కాలంలో ఉన్నామని, ఇది అసాధరణమైన సాంకేతిక మార్పుల సమయ మన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలు శరవేగంగా వ్యాప్తి చెందుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో యువతకు అనేక అవకాశాలు ఉండబోతున్నట్లు చెప్పారు. అదే సమయంలో కొత్త సవాళ్లు, ఆందోళన కలిగించే అంశాలు చాలానే ఉంటాయని ముర్ము అన్నారు. దేశ 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం రాత్రి జాతినుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగించారు.భారతదేశం ప్రజాస్వామ్యానికి తల్లి అని అన్నారు. రాజ్యాంగ నిర్మాతలకు నివాళులర్పించారు. పాశ్చాత్య ప్రజాస్వామ్య భావన కంటే భారతదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా పురాతనమైనదని చెప్పారు. దేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లే సువర్ణావకాశం ప్రజలకు ఉందన్నారు. అమృత్ కాలాన్ని పరివర్తన సమయంగా అభివర్ణించారు. నిర్దేశిత లక్ష్యాల సాధనకు ప్రతి ఒక్కరు సహకరించాలని పిలుపునిచ్చారు. కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ సాంకేతికల పురోగతులు మన దైనందిన జీవితంలో భాగమయ్యాయని చెప్పారు. యువతకు అనేక మార్గాలు, అవకాశాలకు ద్వారాలు తెరుచుకోనున్నాయని తెలిపారు. వారు కొత్త శిఖరాలను చేరుకుంటారని ఆకాంక్షించారు. ఈ క్రమంలో యువత పథంలో వచ్చే అడ్డంకులు, ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడమే కాకుండా వారిలోని సామర్థ్యాన్ని వెలికితీసేందుకు చేయగలిగినదంతా చేయాలని ముర్ము సూచించారు. మన శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులు ముందు చూపుతో పనిచేస్తున్నారని చెప్పారు. అద్భుత పరిశోధనలు, ఆవిష్కరణలకు తెరతీస్తున్నారని ప్రశంసించారు. జీడీపీ వృద్ధిలో భారత్ ముందుందని, పెద్ద ఆర్థిక వ్యవస్థలతో పోల్చితే అత్యధిక జీడీపీ వృద్ధిరేటుగల దేశంగా నిలిచిందని ముర్ము తెలిపారు. ఇదే తరహా వృద్ధి కొనసాగితే భవిష్యత్‌లో మరింతగా పురోగతి సాధించగలమన్నారు. భారత రత్న గ్రహీత కార్పూరీ ఠాకూర్ వెనుకబడిన వర్గాల కోసం , సామాజిక న్యాయం కోసం నిర్విరామంగా పాటుపడిన యోధుడని కొనియాడారు. ఆయన జయంత్యుత్సవాలు ముగిశాయన్నారు. తన జీవితాన్ని వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి అంకితమిచ్చారంటూ ఠాకూర్‌కు రాష్ట్రపతి నివాళి అర్పించారు. అయోధ్యలో రామ మందిరం గురించి ప్రస్తావించారు. ప్రాణ ప్రతిష్ఠ ఘనంగా జరిగిందన్నారు. ఆలయంతో సాంస్కృతిక వారసత్వాన్ని పున:ఆవిష్కృతమైందని ముర్ము అన్నారు.

తొలిరోజు టీమిండియాదే ఆధిపత్యం

- ఉప్పల్ టెస్టులో ఇంగ్లాండ్ 246 ఆలౌట్
- రాణించిన స్పిన్నర్లు
- యశస్వి దూకుడు... భారత్ 119/1

హైదరాబాద్: భారత్-ఇంగ్లాండ్ క్రికెట్ జట్ల మధ్య ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా గురువారం హైదరాబాద్ ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ క్రీడా మైదానంలో తొలి టెస్టు ప్రారంభమైంది. మొదటి రోజు ఆటలో టీమిండియా అన్ని విభాగాల్లో ఇంగ్లాండ్ జట్టుపై ఆధిపత్యం ప్రదర్శించింది. పర్యాటక జట్టును తొలి ఇన్నింగ్స్‌లో స్పిన్ మాయాజాలంతో 246 పరుగులకు ఆలౌట్ చేసిన టీమ్‌ఇండియా... ఆట ముగిసే సమయానికి తన మొదటి ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టానికి 23 ఓవర్లలో 119 పరుగులు చేసింది. క్రీజ్‌లో యశస్వి జైస్వాల్ (76 నాటౌట్: 70 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), శుభ్‌మన్ గిల్ (14) ఉన్నారు. ఓపెనర్, భారత కెప్టెన్ రోహిత్ శర్మ (24) ఫర్వాలేదనిపించాడు. తొలి బంతి నుంచే యశస్వి దూకుడుగా బ్యాటింగ్ చేశాడు. అతడిని కట్టడి చేయడం ఇంగ్లాండ్ బౌలర్ల వల్ల కాలేదు. రోహిత్‌ను జాక్ లీచ్ ఔట్ చేశాడు. భారత్ ఇంకా 127 పరుగులు మాత్రమే వెనకబడి ఉంది. యువ బ్యాటర్ యశస్వి తన టీ20 ఫార్ములాతో పర్యాటక జట్టు 'బజ్‌బాల్' క్రికెట్‌కు సవాల్ విసిరాడు. తొలి రెండు ఓవర్లలో ఒక్క బంతిని కూడా రోహిత్ శర్మను ఎదుర్కోనీయకుండా.. యశస్వినే ఆడేశాడు. రెండో ఓవర్‌లోనే రెండు సిక్స్‌లు కొట్టి తన ఉద్దేశం ఏంటో చెప్పేశాడు. అదే దూకుడు ఆట ముగిసేసవరకూ కొనసాగింది. జట్టు స్కోరు 80కి చేరుకుంటే... అందులో యశస్వివే 53 పరుగులు కావడం విశేషం. రోహిత్ ఔటైన తర్వాత కఠినమైన బంతులను వదిలేస్తూ... అడపాదడపా బౌండరీలతో ఇన్నింగ్స్‌ను నడిపించాడు.

స్పిన్ మాయాజాలం

హైదరాబాద్ పిచ్ తొలిరోజు బ్యాటింగ్‌కు అనుకూలం ఉండి... రెండో రోజు లేదా మూడో రోజు నుంచి స్పిన్‌కు అనుకూలంగా మారుతుందని అంతా భావించారు. కానీ తొలి సెషన్ నుంచే స్పిన్నర్లు ప్రభావం చూపించారు. అశ్విన్ (3/68), జడేజా (3/88), అక్షర్ పటేల్ (2/33) కలిపి ఎనిమిది వికెట్లు పడగొట్టారు. ఇంగ్లాండ్ ఓపెనర్లు డకెట్ (35), జాక్ క్రాలే (20) తొలి వికెట్‌కు 55 పరుగులు జోడించారు. దీంతో రంగంలోకి స్పిన్నర్లను దించిన రోహిత్ సఫలమయ్యాడు. అశ్విన్, జడేజా వెంటవెంటనే వికెట్లు తీసి భారత్‌కు బ్రేక్ అందించారు. బెయిర్‌స్టో (37), రూట్ (29) కుదురుకుని పరుగులు చేయడంతో ఒక దశలో ఇంగ్లాండ్ 120/3 స్కోరుతో ఉంది. మళ్లీ స్పిన్నర్లు విజృంభించి వికెట్లు పడగొట్టారు. ఒక పక్క క్రీజ్‌లో పాతుకు పోయిన ఇంగ్లాండ్ కెప్టెన్ బెన్ స్టోక్స్ (70) అర్ధ సెంచరీ సాధించాడు. చివరికి బుమ్రా (2/28) అద్భుతమైన బంతితో స్టోక్స్‌ను బౌల్డ్ చేసి ఇన్నింగ్స్‌ను ముగించాడు.

సర్జరీల ప్రత్యక్ష ప్రసారంపై అభిప్రాయాలు తెలపండి

న్యూఢిల్లీ: శస్త్రచికిత్సలను కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న అంశాన్ని పరిశీలించేందుకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఓ నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. దీనిపై ఆసుపత్రులు, రోగుల బంధువుల అభిప్రాయాలు కోరింది. 10 రోజుల్లోగా అభిప్రాయాలు వెల్లడించాలని పేర్కొంది. ఆపరేషన్లను ప్రత్యక్షంగా చూపిస్తూ ప్రైవేటు ఆసుపత్రులు వాణిజ్యపరంగా వాటిని వాడుకుంటున్నాయని సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ గతంలోనే దాఖలైంది. అందులోని అంశాలను ఎన్ఎంసీ ప్రస్తావించింది. రోగుల ఆరోగ్య పరిస్థితులను పక్కనపెట్టి అనేక కంపెనీలు తమను తాము ప్రచారం చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాయి. వైద్యవిద్య అవసరాల కోసం ముందుగా రికార్డు చేసి, ఎడిట్ చేసిన సర్జికల్ వీడియోలు ఉపయోగించుకోవచ్చు అని ఎన్ఎంసీ పేర్కొంది. ప్రత్యక్ష ప్రసారంపై న్యాయమైన, నైతికమైన ప్రశ్నలను లేవనెత్తుతూ సుప్రీంకోర్టులో గతేడాది ఓ పిటిషన్ దాఖలైంది. దీనిపై కేంద్రంతో పాటు ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను కోరిన సుప్రీం... ఈ అంశాన్ని ఎన్ఎంసీ పరిశీలనకే వదిలేస్తున్నామని తెలిపింది. దీంతో ఒక నిర్ణయం తీసుకునేందుకు తగిన సిఫార్సులు ఇవ్వడానికి నిపుణుల కమిటీని ఏర్పాటు చేసినట్లు ఎన్ఎంసీ పేర్కొంది. అలాగే ప్రజల అభిప్రాయాలను కూడా కోరింది.

మళ్లీ గ్యాస్ చాంబర్‌గా దిల్లీ

న్యూఢిల్లీ: దేశ రాజధాని దిల్లీ మరోసారి గ్యాస్ ఛాంబర్‌గా మారింది. నగరాన్ని దట్టమైన పొగమంచు కమ్ముకుంది. గాలి వేగంతో పాటు సూర్యరశ్మి గురువారం ఉమధ్యాహ్నం వరకు తక్కువగానే ఉంది. రాత్రి వాతావరణం చల్లగా మారుతోంది. పెరుగుతున్న వాయు కాలుష్యం కారణంగా జనానికి కంటి, శ్వాస సమస్యలు ఎదురవుతున్నాయి. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) 409 వద్ద బుధవారం నమోదు కాగా ఇది మంగళవారం కంటే 41 సూచీలు అధికం. శుక్రవారం ఈశాన్యం నుంచి వాయువ్య దిశలో గాలి 4-8 కిమీల వేగంతో వీయనుంది. శనివారం వాయువ్యం నుంచి పశ్చిమ దిశగా 6-12కిమీల వేగంతో గాలి వీచే అవకాశం ఉంది. ఈ వారం మొత్తం గాలి నాణ్యత పేలవంగానే ఉండవచ్చని వాతావరణ శాఖ అంచనా వేసింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.